ఈనాడు
అనకాపల్లి
శనివారం 28 సెప్టెంబరు 2024

ఆగుతూ అవస్థల ప్రయాణం

బీఎన్ రోడ్డు వాహన చోదకులను హడలెత్తిస్తోంది. వైకాపా ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో వడ్డాది నుంచి రోలుగుంట వరకు దారి పొడవునా పెద్ద పెద్ద గోతులు పడ్డాయి. వర్షం పడితే పొట్టిదొరపాలెం, బుచిరెడ్డిపాలెం, సింగవరం, రావికమతం, గర్నికం, మేడివాడ, రోలుగుంట, కొత్తకోట గ్రామాల పరిధిలోని గోతుల్లో నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సరకు రవాణా చేసే లారీలు, వ్యాన్లు, ఆర్టీసీ బస్సులు గోతుల్లో దిగి పైకి ఎక్కలేక ఆగిపోతున్నాయి. కొత్తకోట జడ్పీ పాఠశాల సమీపంలో శుక్రవారం సరుగుడు లోడు లారీ ఆగిపోయింది. దాని పక్కగా వెళ్లే క్రమంలో ఆర్టీసీ బస్సు గోతిలో కూరుకుపోయింది. ఈ మార్గంలో గంటపాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. స్థానికులు, ప్రయాణికులు బస్సును నెట్టేందుకు యత్నించినా ఫలితం లేకపోయింది. క్రేను, పొక్లెయిన్‌ను రప్పించి బస్సును, లారీని నెట్టడంతో గోతిలోంచి బయటపడ్డాయి. – న్యూస్‌టుడే, రావికమతం


గోతిలో కూరుకుపోయిన ఆర్టీసీ బస్సు, లారీ


బస్సును నెడుతున్న పొక్లెయిన్

ఎస్‌ఈగా ప్రసాద్ బాధ్యతల స్వీకరణ

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ఏపీ ఈపీడీసీఎల్ అనకాపల్లి సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈగా గొప్పు ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. జిల్లాను కొత్త సర్కిల్‌గా ఏర్పాటు చేసిన నేపథ్యంలో విశాఖపట్నం నుంచి ప్రసాద్‌ను అనకాపల్లి ఎస్ఈగా బదిలీ చేశారు. ఈయన పరిధిలో అనకాపల్లి, కశింకోట, నర్సీపట్నం డివిజన్లు ఉంటాయి.



జగన్ చేసింది క్షమించలేని తప్పు
ఎమ్మెల్యే విజయ్‌కుమార్

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ప్రపంచ చరిత్రలో ఎవరూ క్షమించలేని తప్పు మాజీ సీఎం జగన్, తితిదే మాజీ ఛైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి చేశారని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ మండిపడ్డారు. పరమ పవిత్రంగా భావించే వేంకటేశ్వరస్వామి ప్రసాదం లడ్డూను కల్తీ చేసి పెద్ద అపచారం చేశారని ఆరోపించారు. జగన్ పాలనలో జరిగిన మహాపాతకానికి ప్రాయశ్చిత్తంగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దీక్ష చేపట్టిన విషయం తెలిసిందే. దీనికి సంఘీభావంగా శుక్రవారం అచ్యుతాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో సుందరపు మూడురోజుల దీక్షను ప్రారంభించారు. జగన్ ఎన్ని నాటకాలు ఆడినా అర్థం చేసుకోలేకపోవడానికి రాష్ట్ర ప్రజలు, దేశంలో హిందువులు అమాయకులు కాదన్నారు. దీనికి బాధ్యులైన జగన్, సుబ్బారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ధర్మారెడ్డిలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే సుందరపుతో పాటు జనసేన మండల అధ్యక్షులు బైలపూడి రాందాసు, ద్వారపరెడ్డి బాబ్జీ, మోటూరు త్రినాథస్వామి దీక్ష చేపట్టారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్‌కుమార్, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డ్రీమ్స్ నాయుడు, పుర్రే శ్రీను, సిరసపల్లి రమణ, కోలా మహేష్, మేరుగు బాపునాయుడు, కర్రి రమణ తదితరులు పాల్గొన్నారు.


ప్రాయశ్చిత్త దీక్షలో ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, నాయకులు

మహిళా కబడ్డీ పోటీల విజేత విజయనగరం

మునగపాక, న్యూస్‌టుడే: మునగపాకలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీల్లో విజయనగరం జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. మరిడిమాంబ పండగ సందర్భంగా గురు, శుక్రవారాల్లో పోటీలు నిర్వహించారు. మొదటి స్థానంలో విజయనగరం నిలవగా, రెండో స్థానంలో విశాఖ, మూడు- శ్రీకాకుళం, నాలుగు- గుంటూరు జట్లు నిలిచాయి. విజేతలకు ఆర్ఈసీఎస్ మాజీ ఛైర్మన్ బొడ్డేడ ప్రసాదు, ఆడారి కృష్ణ, టెక్కలి పరశురామ్, ఆడారి గణపతి అచ్చింనాయుడు తదితరులు ట్రోఫీలతో పాటు నగదు బహుమతులను అందజేశారు. ఫ్లడ్‌లైట్ల వెలుతురులో నిర్వహించిన ఈ పోటీల్లో కోనపల్లి రామ్మోహనరావు, ఆడారి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు ట్రోఫీ అందిస్తున్న అతిథులు

వైకేపీలో వైకాపా మార్కు దందా

ఈనాడు, అనకాపల్లి

గత ప్రభుత్వ హయాంలో దొంగ పొదుపు సంఘాలను సృష్టించి బ్యాంకుల నుంచి రూ.కోట్ల రుణాలు వాడేసుకున్నారు. ఇటీవల పిఠాపురంలో వెలుగుచూసిన ఈ అక్రమ రుణాల బాగోతం కూటమి ప్రభుత్వం దృష్టికి వెళ్లింది. ఈ తరహా నకిలీ సంఘాల వ్యవహారం మిగతా చోట్ల కూడా ఉన్నాయని గ్రహించింది. రాష్ట్రవ్యాప్తంగా డ్వాక్రా రుణాల అక్రమాలపై విచారణ చేయాలని నిర్ణయించింది.

వైకాపా ప్రభుత్వంలో అనకాపల్లిలో పలు బ్యాంకుల నుంచి సుమారు రూ.7 కోట్లకు పైగా పక్కదారి పట్టించారు. గ్రామైక్య సంఘాల లీడర్లే (వీఓఏ) నకిలీ సంఘాల సృష్టికర్తలు. అప్పట్లో వారి అక్రమాలకు నేతలు అండగా నిలవడంతో చర్యలకు మీనమేషాలు లెక్కిస్తూ వచ్చారు. ఎన్నికల ముందు ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి రావడంతో వీవోఏలుగా తప్పించారు. వారితో అంటకాగిన ఒక ఏపీఎం, ఇద్దరు సీసీలను సస్పెండ్ చేశారు. ఆరు నెలలకే మరలా వారిని గుట్టుచప్పుడు కాకుండా విధుల్లోకి తీసుకుని అల్లూరి జిల్లాకు పంపించేశారు. కూటమి ప్రభుత్వం మరలా నకిలీ రుణాలపై ఆరాలు తీయడంతో వెలుగు అధికారుల్లో గుబులు రేగుతోంది.



'వెలుగు'చూడని అక్రమాలెన్నో!

బ్యాంకు లింకేజీలోనే కాదు స్త్రీనిధి రుణాలు కూడా పక్కదారి పట్టించారు. వైకాపా నేతలు కొందరు బినామీ పేర్లతో ఈ రుణాలు వాడేసుకున్నారు. దేవరాపల్లి, చోడవరం, గొలుగొండ, పాడేరు మండలాల్లో స్త్రీనిధి, ఉన్నతి రుణాల అక్రమాలు అనేకం చోటుచేసుకున్నాయి. అప్పట్లో స్థానికంగానే గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు ఉండడంతో అక్రమాలు వెలుగుచూస్తే పార్టీకి ఇబ్బందని బయటపెట్టనివ్వలేదు. క్షేత్రస్థాయి సిబ్బందిపై తాత్కాలిక క్రమశిక్షణా చర్యలు తీసుకున్నా, రుణాల తీరును పర్యవేక్షించాల్సిన డీపీఎంలు, ప్రాజెక్టు మేనేజర్‌కు కేవలం తాఖీదులతోనే సరిపెట్టేశారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన రుణాలపై కూటమి సర్కారు ప్రత్యేక ఆడిట్ చేయాలని భావిస్తోంది. దీంతో అక్రమార్కుల్లో ఆందోళన మొదలైంది. బదిలీలపై వెళ్లిపోయినా బాధ్యులపై చర్యలు తప్పవని వెలుగు ఉన్నతాధికారి ఒకరు చెప్పారు.

డ్వాక్రా సంఘాల్లో నకి'లీలలు' ఇవిగో..

✦ గుండాల వీధి గ్రామైక్య సంఘం పరిధిలో 16 నకిలీ సంఘాలు సృష్టించారు. మూడు బ్యాంకుల నుంచి రూ.2.23 కోట్లు పక్కదారి పట్టించారు.

✦ గుండాల వీధి-2 గ్రామైక్య సంఘం పరిధిలో 10 నకిలీ సంఘాలు ఏర్పాటు చేశారు. మూడు ప్రైవేటు బ్యాంకుల నుంచి రూ.1.34 కోట్లు రుణాలు తీసుకుని దుర్వినియోగానికి పాల్పడ్డారు.

✦ విద్యుత్తు నగర్ గ్రామైక్య సంఘం పరిధిలో రెండు నకిలీ సంఘాలు సృష్టించి రెండు బ్యాంకుల ద్వారా రూ.28 లక్షలు రుణాలు పొందారు.

✦ కొత్తూరు, మూలపేట గ్రామైక్య సంఘాల పరిధిలో మరి కొన్ని నకిలీ సంఘాలు ఏర్పాటు చేసి రూ.కోట్లలో సొమ్ములు సొంతానికి వాడేసుకున్నట్లు విచారణలో గుర్తించారు.


నకిలీ పొదుపు సంఘాల రుణాలపై విచారణ జరుపుతున్న అధికారులు (పాత చిత్రం)

టార్గెట్ల కోసం పత్రాలేవీ పరిశీలించకుండానే: బ్యాంకు లింకేజీలు, స్త్రీనిధి రుణాల విషయంలో వీవోఏలే కీలకంగా పని చేస్తారు. ఒక బ్యాంకులో రుణాలు తీసుకున్న పొదుపు సంఘాలు మరో బ్యాంకుకు మారేటప్పుడు (మైగ్రేషన్) ఎక్కువ మొత్తంలో అప్పు పొందడానికి అవకాశం ఉంటుంది. ఇదే లొసుగును వీవోఏ ప్రతినిధులు సొమ్ముచేసుకున్నారు. బ్యాంకర్లు కూడా తమ టార్గెట్లు కోసం పత్రాలేవీ పరిశీలించకుండానే రుణాలు ఇచ్చేశారు. ఇలా 40 పైగా నకిలీ సంఘాలతో రూ.7 కోట్లను నాలుగు బ్యాంకుల నుంచి వాడుకున్నారు. సాధారణంగా ఓ పొదుపు సంఘంలో ఆ గ్రామానికి, ఆ ప్రాంతానికి చెందినవారే ఉంటారు. ఈ నకిలీ గ్రూపులను పరిశీలిస్తే వేర్వేరు మండలాలకు చెందిన పది సభ్యులను ఒక గ్రూపుగా సృష్టించి వారి ఫొటోలు, ఆధార్ కార్డులు జతచేసి బ్యాంకులను బురిడీ కొట్టించారు. ఇందులో కొంతమంది సభ్యులు కూడా గ్రామైక్య సంఘం ప్రతినిధులతో లాలూచీ పడి వారి ఖాతాలో పడిన సొమ్ములో కొంత మినహాయించుకుని మిగతా మొత్తాన్ని వీవోఏ అధ్యక్ష, కార్యదర్శుల ఖాతాలకు మళ్లించినవారు ఉన్నారు. చాలామందికి తమ పేరిట రుణాలు వాడినట్లే తెలియదు.. వీటిపై ఫిర్యాదు వచ్చాక విచారణ జరిపి బాధ్యులను గుర్తించి నామమాత్రపు చర్యలకే పరిమితమయ్యారు..

ఇద్దరు డిప్యూటీ జోనల్ మేనేజర్లు రాక!

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: అచ్యుతాపురం ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్‌గా సూర్యనారాయణ నియమితులయ్యారు. గతంలో 2016-23 మధ్య ఏడేళ్లు ఏపీఐఐసీ మేనేజర్‌గా పనిచేసి పదోన్నతిపై విజయవాడ వెళ్లారు. కొత్త జిల్లా యూనిట్‌గా బదిలీలు చేపట్టడంతో ఈయన అనకాపల్లికి వచ్చి వచ్చారు. డీజెడ్ఎం రాజశేఖర్ విజయవాడ నుంచి ఇక్కడికి వచ్చారు.


సూర్యనారాయణ

నూకాలమ్మ ఆలయ ఇన్‌ఛార్జి ఈవోగా సుజాత



అనకాపల్లి, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్ర భక్తుల ఇలవేల్పు అనకాపల్లి నూకాలమ్మ దేవస్థానం ఇన్‌ఛార్జి ఈవోగా దేవాదాయ ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్.సుజాత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు పనిచేసిన ఈవో పి.అన్నపూర్ణను విశాఖ జిల్లా దేవాదాయ శాఖ అధికారిణిగా నియమించారు.

జలవనరులశాఖ ఈఈ బదిలీ

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: జలవనరుల శాఖ నర్సీపట్నం కార్యనిర్వాహక ఇంజినీరు స్వామినాయుడు విశాఖపట్నం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఇంకా ఎవ్వరినీ నియమించలేదు.

ఎలాగైనా ఇల్లు పూర్తయ్యేలా..

✦ సహకరించేందుకు కూటమి ప్రభుత్వం చొరవ
✦ 'మన ఇల్లు.. మన గౌరవం' సదస్సులు నేడు


సొంత స్థలంలో అసంపూర్తిగా ఉన్న ఇల్లు (పాతచిత్రం)

ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై)లో మంజూరైన ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా కూటమి ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించుకుంది. 'మన ఇల్లు.. మన గౌరవం' పేరిట అధికారులను లబ్ధిదారుల వద్దకు పంపి చైతన్య కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించింది. ఒక్కో అధికారికి రెండు కాలనీల బాధ్యతలను అప్పగించింది.

చోడవరం, నక్కపల్లి, న్యూస్‌టుడే

పీఎంఏవైలో మంజూరైన ఇళ్ల నిర్మాణానికి అయ్యే వ్యయమంతా కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది. వైకాపా ప్రభుత్వం ఈ ఇళ్లకు జగనన్న కాలనీ బోర్డులు తగిలించి తామే ఇచ్చినట్లు ప్రచారం చేసుకుంది. గతంలో మంజూరైన ఇళ్లు పూర్తికాకుంటే వచ్చే ఏడాది కేంద్రం కొత్తవి మంజూరు చేసేందుకు ఇబ్బందులు ఏర్పడే ఆస్కారముంది. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం లబ్ధిదారులతో మాట్లాడి ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించాలని ఆదేశించింద'ని గృహ నిర్మాణ సంస్థ అనకాపల్లి డివిజన్ ఇన్‌ఛార్జి ఈఈ ఎస్‌వీఎస్ శ్రీనివాసరావు చెప్పారు. రూఫ్ లెవల్‌లో ఉన్నవి అక్టోబరు నెలాఖరుకు, మిగిలినవి 2025 మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేయాలని లక్ష్యమన్నారు.

తక్కువ ఖర్చుతో పనయ్యేలా: ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయించడానికి వీలుగా ఇప్పటికే అధికారులు జాబితా సిద్ధం చేశారు. ఏ మండలంలో ఎన్ని ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయనే దానిపై సమగ్ర సమాచారం ఉంచారు. ఇందుకోసం సచివాలయానికి ఓ నోడల్ అధికారితో బృందాన్ని సిద్ధం చేశారు. వీరు లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణాలు ఆపేయడానికి కారణాలను తెలుసుకుంటారు. అందుబాటులో ఉన్న నిర్మాణదారులను తక్కువ ధరకు పనిచేసేలా మాట్లాడటం, తక్కువ ధరకు మెటీరియల్ ఇప్పించడం వంటివి చేస్తారు. మెటీరియల్ తీసుకుని ఇంటి నిర్మాణం చేయనివారితోనూ పనులు మొదలు పెట్టించాలనేది ప్రభుత్వ లక్ష్యం.

ఇదీ లక్ష్యం

✦ పునాది నుంచి లింటెల్ స్థాయిలో ఉన్న ఇళ్లను వచ్చే ఏడాది మార్చిలోగా పూర్తి చేయాలి.

✦ శ్లాబు స్థాయి/శ్లాబు వేసిన ఇళ్లను ఈ ఏడాది డిసెంబరులోగా పూర్తి చేయడం.

కట్టుకోకపోతే అన్నివిధాలా నష్టపోతారు.. గతంలో పని మొదలు పెట్టి, వాటికి సంబంధించి త్వరలోనే గడువు ముగియనుంది. ఇలాంటి వారంతా తమకు రావాల్సిన బిల్లులు నష్టపోతారు. భవిష్యత్తులో ఈ నిధులురావు. కొత్త పథకాల్లో అర్హత ఉండదు. ఫలితంగా లబ్ధిదారులు నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం మన ఇల్లు మన గౌరవం పేరిట లక్ష్యాన్ని నిర్దేశించింది. ఇప్పుడు ప్రారంభించిన ఇళ్లన్నీ మార్చిలోగా పూర్తిచేయించడమే ముందున్న లక్ష్యం. – నీరజ, ఈఈ, నర్సీపట్నం డివిజన్, గృహనిర్మాణ సంస్థ

నియోజకవర్గం	మంజూరు	పూర్తి
అనకాపల్లి	10,718	4,408
చోడవరం	6,710	3,308
మాడుగుల	8,023	2,858
నర్సీపట్నం	7,951	3,534
పాయకరావుపేట	11,879	4,220
పెందుర్తి	3,025	1,594
ఎలమంచిలి	6,636	3,371
మొత్తం →	54,942	23,293

జిల్లాలో ఇళ్ల నిర్మాణం ఇలా.. మంజూరైన ఇళ్లు: 54,924 | మొదలు కానివి: 13,255 | నిర్మాణం మొదలై, వివిధ స్థాయిల్లో నిలిచినవి: 18,108


శిలాఫలకం ఆవిష్కరణలో కలెక్టర్ విజయ, ఎమ్మెల్యే కొణతాల, పీలా

రూ.కోటితో రహదారి నిర్మాణానికి శంకుస్థాపన

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: కోడూరు పంచాయతీ గోపాలపురం-పీతపాలెం రహదారి నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఉపాధి హామీ పథకం కింద రూ. కోటితో రెండు కిలోమీటర్ల మేర బీటీ రహదారి నిర్మాణానికి కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, పట్టణ ఆర్థిక, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరితగతిన పనులు పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నాణ్యత ప్రమాణాలు తప్పకుండా పాటించాలన్నారు. ఆర్డీవో చిన్నికృష్ణ, పంచాయతీ రాజ్ ఈఈ వీరం నాయుడు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

బొజ్జన్న కొండకు కొత్త సొబగులు

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రసిద్ధి చెందిన శంకరం బొజ్జన్న కొండను రూ.7.50 కోట్లతో అభివృద్ధి చేశారు. దీన్లోభాగంగా నిర్మించిన ధ్యాన మందిరం, లైట్ అండ్ లేజర్ షోను ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చువల్ విధానంలో శుక్రవారం ప్రారంభించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకుని జరిగిన ఈ కార్యక్రమం ఏర్పాట్లను ఈఈ సీతారామారావు పర్యవేక్షించారు కొండ పైభాగంలో లైటింగ్ ఆకట్టుకుంది.


సౌండ్, లైటింగ్ సిస్టమ్‌ను వర్చువల్‌లో ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు

చెరువులకు జలకళ

అనకాపల్లి/ గ్రామీణం, న్యూస్‌టుడే

పలు మండలాల్లో శుక్రవారం భారీ వర్షం కురిసింది. జిల్లాలో 480 మిల్లీమీటర్ల వర్షం పడిందని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ విభాగం శాస్త్రవేత్తలు తెలిపారు. మూడు మండలాల్లో భారీ వర్షం నమోదైంది. పల్లపు ప్రాంతాలలోని పంటపొలాలు నీట మునిగిపోయాయి. చెరకు తోటల్లోకి నీరు చేరింది. మెట్టప్రాంతాల్లో పంటలకు ఈ వర్షాలు మేలు చేస్తాయని శాస్త్రవేత్తలు తెలిపారు. జిల్లాలో అన్ని ప్రాంతాల కంటే నక్కపల్లిలో ఎక్కువగా 87.2 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. దేవరాపల్లిలో అస్సలు వర్షం కురవలేదు.


నక్కపల్లిలో..

మండలం	కురిసిన వర్షం
నక్కపల్లి	87.2
రాంబిల్లి	55.4
ఎస్.రాయవరం	42.8
ఎలమంచిలి	38.8
కశింకోట	28.2
పరవాడ	25.0

భారీ వర్షాలకు చెరువులు జలకళను సంతరించుకున్నాయి. ఎడతెరిపి లేకుండా వర్షం పడడంతో శంకరం, రేబాక, గోపాలపురం, గొలగాం, చింతనిప్పుల అగ్రహారం, కోడూరు తదితర గ్రామాల్లోని చెరువులు నిండుకుండలా మారాయి. గెడ్డలు, వాగుల నుంచి నీరు చెరువుల్లో చేరుతోంది.

రేబాకలో ఉద్యోగ మేళా 30న

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: ఈనెల 30న రేబాకలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఎన్.గోవిందరావు శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. పది నుంచి పీజీ వరకు చదువుకొని 18-30ఏళ్ల వయస్సు మధ్య ఉన్న వారు ఈ ఇంటర్వ్యూలకు హాజరుకావొచ్చన్నారు. ముందుగా skilluniverse.apssdc.in వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకొని ఉదయం 9 గంటలకు హాజరుకావాలన్నారు. వివరాలకు 81432 29228 నంబర్‌కు కాల్ చేయొచ్చన్నారు.

ప్రకృతి సౌందర్య నిలయం శారదావనం

కశింకోట, న్యూస్‌టుడే: ప్రకృతి సౌందర్యాన్ని పర్యటకులకు పరిచయం చేయడమే శారదావనం ఏర్పాటు లక్ష్యమని అటవీ శాఖ ముఖ్య సంరక్షణాధికారి ఎస్.శ్రీకంఠనాథరెడ్డి అన్నారు. బయ్యవరం సమీపాన ఏర్పాటు చేసిన ఈ వనాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. దశలవారీగా ఈ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. విద్యార్థులు అటవీ సంపద, అడవుల ప్రాధాన్యం, వాటి సంరక్షణపై స్వీయ అనుభవంతో తెలుసుకునే వీలుంటుందన్నారు. ప్రతి జిల్లాలో ఇలాంటి వనాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోందన్నారు. ఇవి ప్రకృతి ఆరాధకులకు, ఇటు విద్యార్థులకు, పర్యటకులకు ఆనందాన్ని, ప్రశాంతతను అందిస్తాయని వివరించారు. జిల్లా అటవీశాఖ అధికారి ఆర్.జగన్నాథ్‌సింగ్, సామాజిక అటవీ విభాగం జిల్లా అధికారి లక్ష్మణ్, సబ్ డివిజనల్ అటవీశాఖ అధికారి సునీల్ కుమార్, అటవీ రేంజ్ అధికారిణి జ్యోతిర్మయి, అటవీ శాఖ అధికారులు కాశీప్రసాద్, ఎం.గోవింద తదితరులు పాల్గొన్నారు.


శారదావనాన్ని ప్రారంభిస్తున్న అటవీ ముఖ్య సంరక్షణాధికారి శ్రీకంఠనాథ్‌రెడ్డి

దొంగ మస్తర్లతో నిధుల స్వాహా

రికవరీతోపాటు బాధ్యులపై చర్యకు డిమాండు

రోలుగుంట, న్యూస్‌టుడే: గ్రామాల్లో నివాసం ఉండని వారు, ఇతర ప్రాంతాలకు వలసవెళ్లిన వారి పేర్లతో దొంగ మస్తర్లు వేసి ఉపాధి హామీ పథకం నిధులను స్వాహా చేశారు. ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవడంతోపాటు సొమ్మంతా రికవరీ చేయాలని తెదేపాకు చెందిన ప్రజా ప్రతినిధులు డిమాండు చేశారు. ఉపాధి హామీ పథకంలో గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి నెలాఖరు వరకు రోలుగుంట మండలంలోని 24 పంచాయతీల్లో రూ.17.4 కోట్లతో 1,117 పనులు జరిగాయి. వీటిపై మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. 'ఎం.కె.పట్నంలో కొంతమంది సిబ్బంది దొంగ మస్తర్లు వేసి నిధులను స్వాహా చేశారు. కొండపాలెం పంచాయతీలో పనులకు రాకున్నా.. సుమారు 20 మంది వచ్చినట్లు మస్తర్లు దిద్ది చెల్లింపులు చేశారం'టూ ఉప సర్పంచి చిరంజీవితో పాటు పలువురు అధికారులను నిలదీశారు. ఫిర్యాదులన్నింటినీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్టేట్ రిసోర్స్ పర్సన్ నాగరాజు చెప్పడంతో శాంతించారు. ఏపీడీ రోజారాణి, విజిలెన్స్ విభాగం అధికారిణి దివ్య, ఈవోఆర్డీ నూకరాజు తదితరులు పాల్గొన్నారు.



రోలుగుంటలో సామాజిక తనిఖీ ప్రజావేదిక

సర్కారు సాయంపైనే ఆశలన్నీ..!

చోడవరం, న్యూస్‌టుడే



మహాజన సభ స్వాగత ద్వారం

గోవాడ చక్కెర కర్మాగారాన్ని ఆదుకుని అండగా నిలుస్తుందని కూటమి సర్కారుపైనే చెరకు రైతులు, కార్మికులు గంపెడాశలు పెట్టుకున్నారు. టన్నుకు రూ.3,500 చొప్పున చెల్లిస్తామని, ఉప ఉత్పత్తుల తయారీతో గాడిలో పెడతామంటూ ఎన్నికల ప్రచారంలో నాయకులు హామీలిచ్చారు. అనుకున్నట్లే కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. శనివారం జరగనున్న మహాజన సభలో ప్రజాప్రతినిధులు చేసే ప్రకటన అందరికీ తీపిని పంచుతుందని ఆశగా ఎదురుచూస్తున్నారు.

ప్రస్తుత గానుగాట కాలానికి చెరకు రైతులకు టన్నుకు రూ.3,151 చొప్పున కర్మాగారం యాజమాన్యం చెల్లించనుంది. ఈ ఏడాది 1.5 లక్షల టన్నుల చెరకును గానుగాట చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కూటమి నాయకులు చెప్పినట్లు టన్నుకు రూ.3,500 చొప్పున చెల్లించాలంటే అదనంగా రూ.ఐదు కోట్లు అవసరమవుతాయి. చెరకు సరఫరా చేసిన రైతులకు 15 రోజుల్లో వారి బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేయాలి. ఇప్పటి వరకు మొదటి విడతగా టన్నుకు రూ.2,500 చొప్పున చెల్లిస్తున్నారు. టన్నుకు రూ.3 వేల చొప్పున మొదటి విడతగా జమ చేయాలని రైతులు కోరుతున్నారు. దీనిపై మహాజన సభలో ప్రకటన చేస్తారని అన్నదాతలు ఆశపడుతున్నారు.

తగ్గుతున్న సాగు విస్తీర్ణం

గోవాడ కర్మాగారానికి చెరకు సరఫరా చేయడమంటే రైతులు గౌరవంగా భావించేవారు. కర్మాగారం పరిధిలో 24,231 మంది రైతులున్నారు. వీరిలో ఏటా 2500 మంది చెరకు సరఫరాకు విముఖత చూపుతున్నారు. ముగిసిన గానుగాట కాలానికి 14,301 మంది రైతులే సరఫరా చేశారు. గతంలో 30 వేల నుంచి 41 వేల ఎకరాల్లో చెరకు సాగయ్యేది. ఆరు లక్షల నుంచి 8 లక్షల టన్నుల వరకు దిగుబడి వచ్చేది. సకాలంలో చెల్లింపులు చేయకపోవడం, ధర గిట్టుబాటుకాక రైతులు సాగుకు దూరమవుతూ వస్తున్నారు. 2024-25 గానుగాట కాలానికి పది వేల ఎకరాల్లోనే చెరకు సాగవుతోందని అధికారులు చెబుతున్నారు. 1.7 లక్షల టన్నుల దిగుబడి వస్తే.. అందులో 1.3 లక్షల టన్నులే గానుగాటకు వస్తుందని, మరో 20 వేల టన్నులు సభ్యత్వం లేని రైతుల నుంచి సేకరించాలని యోచిస్తున్నారు.

రూ.87.78 కోట్ల నష్టం

కర్మాగారం ఏటా నష్టాలనే చవిచూస్తోంది. 2022-23 గానుగాట కాలంలో రూ.16.54 కోట్ల నష్టం వచ్చింది. 2023-24 ఆడిట్ నివేదిక రావాల్సి ఉంది. సంచిత నష్టం (ఎక్యుములేటెడ్ లాస్) రూ.87.78 కోట్లకు చేరింది. ఆప్కాబ్ రుణం, వడ్డీ భారాలు వీటికి అదనం. ఆర్థిక సంక్షోభం నుంచి కాస్తయినా ఉపశమనం లభించాలంటే ఇథనాల్, డిస్టలరీ యూనిట్ల ఏర్పాటు చేయాల్సిన అవసరముంది. ప్రభుత్వం ఆర్థికంగా చేయూత అందిస్తే తప్ప కర్మాగారం మనుగడ కష్టమని ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి.

వందరోజుల పాలనలో

ప్రజలకు సంక్షేమ పథకాలు

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: వంద రోజుల పాలనలో కూటమి ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సంక్షేమ పథకాలు అందించిందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పేర్కొన్నారు. కోడూరులో శుక్రవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల హామీలో భాగంగా పెంచిన పింఛను తక్షణమే లబ్ధిదారులకు అందించామన్నారు. అభివృద్ధి, సంక్షేమం చేసి చూపామన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనలో భాగంగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. అన్న క్యాంటీన్లు ప్రారంభించి పేదల ఆకలి తీర్చామన్నారు. అనంతరం పట్టణ ఆర్థిక, మౌలిక సదుపాయాల సంస్థ ఛైర్మన్‌గా ఇటీవల ఎన్నికైన మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్ సత్యనారాయణను సభలో సత్కరించారు. మెగా వైద్యశిబిరాన్ని సందర్శించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చిన్నారులకు అన్నప్రాసన చేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.



కోడూరు సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు పేట విద్యార్థులు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: జాతీయస్థాయి ఖోఖో పోటీలకు శ్రీప్రకాష్ విద్యార్థులు ఎంపికయ్యారు. సీబీఎస్ఈ బోర్డు ఈ నెల 22 నుంచి 26వ తేదీ వరకు తెలంగాణాలోని బచ్చుపల్లిలో క్లస్టర్-7 ఖోఖో పోటీలు నిర్వహించింది. అండర్-14 విభాగంలో లాలం పూర్ణశ్యామ్ బృందం, అండర్-19 విభాగంలో జి.ధనుష్ బృందం ప్రథమస్థానంలో నిలిచి బంగారు పతకాలు సాధించాయి. వచ్చే నెల 16 నుంచి 19వరకు దేవాస్ (మధ్యప్రదేశ్)లో జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. బాలికల అండర్-14 విభాగంలో జి.కావ్యసుధ బృందం తృతీయస్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించింది. విద్యార్థులను శ్రీప్రకాష్ విద్యాసంస్థల అధినేత సీహెచ్.వి.కె.నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్, కోచ్‌లు చిరంజీవి, హేమ అభినందించారు.



జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థులతో శ్రీప్రకాష్ విద్యాసంస్థల అధినేత నరసింహారావు

అవివాహితులకు సువర్ణావకాశం

నేడు, రేపు కమ్మ అవివాహిత యువతకు 'ఈనాడు పెళ్లిపందిరి' ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం

తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన 'ఈనాడు పెళ్లిపందిరి' కమ్మ అవివాహిత యువత కోసం ఉచిత ప్రొఫైల్, రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. అక్కయ్యపాలెం అబీద్‌నగర్‌లోని రత్నమాల రెసిడెన్సీలోని 'ఈనాడు' కార్యాలయం వేదికగా ఈ కార్యక్రమం జరుగుతుంది. వివాహం కోసం ఎదురు చూస్తున్న యువతతో పాటు సంబంధిత కుటుంబీకులు నేడు (శనివారం, సెప్టెంబరు 28న), రేపు (ఆదివారం, సెప్టెంబరు 29న) ఉదయం 9 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు 91549 18858, 80080 01686 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చు. ఫోన్ ద్వారా కూడా ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. బయోడేటా, ఫొటోలను పైన తెలియజేసిన వాట్సాప్ నెంబర్లకు పంపాలి.

– న్యూస్‌టుడే, విశాఖపట్నం

కోరా షూస్ షోరూం ప్రారంభం

విశాఖపట్నం, న్యూస్‌టుడే: ద్వారకానగర్ మొదటి లైనులో ఏర్పాటు చేసిన కోరా షూస్ షోరూంను శుక్రవారం విశాఖ దక్షిణం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నాణ్యమైన పాదరక్షలను విక్రయించి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. షోరూం అధిపతి కేవీ చలపతి మాట్లాడుతూ తమకు ఈ రంగంలో నాలుగు దశాబ్దాల అనుభవం ఉందన్నారు. ఏడాదికి 12లక్షల లెదర్ బూట్లు(షూస్), ఉత్పత్తులను యూరప్ దేశాలకు ఎగుమతి చేస్తున్నామన్నారు. 2020-21, 2022-23 సంవత్సరాల్లో అఖిల భారత స్థాయిలో ఎక్స్‌పోర్ట్ ఎక్సలెన్సీ అవార్డు లభించిందన్నారు. విశాఖ నగరవాసులకు నాణ్యమైన పాదరక్షలను సరసమైన ధరలకు అందించాలన్న సంకల్పంతో ఇక్కడ అవుట్‌లెట్ ప్రారంభించినట్లు వివరించారు.



షోరూంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

వైద్యసేవలపై టాస్క్‌ఫోర్స్ పరిశీలన

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: విలేజ్ హెల్త్ క్లినిక్ కేంద్రాల్లో అందుతున్న వైద్య సేవలను టాస్క్‌ఫోర్స్ బృందం శుక్రవారం పరిశీలించింది. పెనుగొల్లు పీహెచ్‌సీ సిబ్బంది శుక్రవారం వమ్మవరంలో గర్భిణులు, బాలింతలు, విద్యార్థులకు రక్తపరీక్షలు నిర్వహించారు. వైద్యసేవలపై టాస్క్‌ఫోర్స్ బృందం సమీక్షించి, కేంద్రంలో నిర్వహిస్తున్న వైద్య పరీక్షలు, మందుల పంపిణీ తదితర అంశాలపై నివేదిక తయారు చేశారు. గర్భిణుల ఆరోగ్య నివేదికలు పరిశీలించి, రక్తపరీక్షల నమూనాలు తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కార్యక్రమ నిర్వాహణ అధికారిణి డాక్టర్ లూసీ కార్డిలియా సిబ్బంది సూచించారు. జిల్లా గణాంకాధికారి రామచంద్రరావు, జిల్లా ప్రోగ్రామింగ్ అధికారి జగదీష్, డీఈఓ దినేష్, ఆరోగ్య బోధకుడు శ్రీనివాస్, సూపర్‌వైజర్ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



గర్భిణుల ఆరోగ్య నివేదికలు పరిశీలిస్తున్న డాక్టర్ లూసీ కార్డిలియా

సినిమా టికెట్లకు థియేటర్ సిబ్బందిపై దాడి

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: దేవర బెనిఫిట్ షో టికెట్లు ఇవ్వలేదనే కారణంతో థియేటర్ సిబ్బందిపై దాడిచేసిన సంఘటన గురువారం అర్ధరాత్రి జరిగింది. దీనిపై థియేటర్ మేనేజర్ కొండబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పూడిమడకకు చెందిన ఇద్దరు యువకులు బెనిఫిట్ షో చూడడానికి గురువారం అర్ధరాత్రి అచ్యుతాపురం సెజ్‌లో రోడ్డులోని సినిమాహాల్‌కు వచ్చారు. పూడిమడక మత్స్యకారులకు అప్పటికే ఒక స్క్రీన్ టికెట్లు పూర్తిగా పంపిణీ చేసేశారు. మరో స్క్రీన్‌లో టికెట్లు పొందాలని ప్రయత్నించినా వీలుకాకపోవడంతో ఆగ్రహంతో గేటుదూకి ఆపరేటర్ రవికుమార్, రక్షణ సిబ్బంది జి.ఈశ్వరరావులపై దాడిచేశారు. ఈ దాడిలో ఇద్దరూ గాయపడడంతో అచ్యుతాపురంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. భారీగా అభిమానులు థియేటర్ వద్దకు రావడం, వీరిని నిలువరించడానికి పోలీసులు లేకపోవడంతో ఈ సంఘటన జరిగిందని స్థానికులు తెలిపారు. పూడిమడకకు చెందిన ఒక నాయకుడే ఈ విధంగా దాడి చేయించారని మేనేజర్ కొండబాబు ఆరోపించారు.



నోబుల్ టీచర్స్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులతో ఉపాధ్యాయులు

ప్రభుత్వ దృష్టికి ఉపాధ్యాయుల సమస్యలు

కశింకోట, న్యూస్‌టుడే: కస్తూర్బా విద్యాలయాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్తామని జిల్లా నోబుల్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు టి.వి.రమణ, ఎన్.శ్రీనుబాబు తెలిపారు. తేగాడలో శుక్రవారం సమావేశమయ్యారు. మినిమం టైంస్కేల్ అమలు చేయాలని, కంప్యూటర్ టీచర్ల జీతాలు పెంచాలని తదితర డిమాండ్లతో ప్రభుత్వానికి విన్నవించనున్నట్లు తెలిపారు. ప్రత్యేకాధికారిణి చంద్రకళ పాల్గొన్నారు.

6న రామాయణంపై పోటీలు

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: తెలుగు భాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో వచ్చేనెల 6న రామాయణంపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు సమితి ప్రతినిధులు తెలిపారు. 9, 10 విద్యార్థులను సీనియర్లుగా, 6, 7, 8 విద్యార్థులను జూనియర్లుగా విభజించి ఈ పోటీలను నిర్వహిస్తామని ఒక ప్రకటనలో తెలిపారు. సీతారామ కల్యాణం, శ్రీరాముని వనవాసానికి కారణాలు, సీతాపహరణ, సీతాన్వేషణ, సేతువు నిర్మాణం, శ్రీరామసుగ్రీవుల మైత్రీ, లంకా దహనం, రామ రావణయుద్ధంపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. విశ్వామిత్రుడు, హనుమంతుడు, మారీచుడు, లక్ష్మణుడు, వాలి, భరతుడు, సీత, ఇంద్రజిత్, రావణుడు, కైక పాత్రలపై వక్తృత్వ పోటీలు చేపడతాన్నారు. వచ్చే నెల 6న ఈ పోటీలు నిర్వహించి 10న విజేతలకు నగదు, జ్ఞాపికలను అందిస్తామని సమితి ప్రతినిధులు రామ్మోహనరావు, రంగబాబు, శిష్టా తమ్మిరాజు, మాధవీ సనారా తెలిపారు.

ఎక్సైజ్ డీసీ బాధ్యతల స్వీకరణ

విశాఖపట్నం, న్యూస్‌టుడే: ఉమ్మడి విశాఖ జిల్లా ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్‌గా డి.శ్రీరామ చంద్రమూర్తి శుక్రవారం విశాఖలో బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇప్పటివరకు సెబ్‌లో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేశారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	107	98
లైవ్	129	118
డ్రెస్‌డ్	187	206
స్కిన్‌లెస్	213	216

తెరపై ఈనాడు

అనకాపల్లి: రాజా, రామచంద్ర, పద్మిసాయి, సత్యనారాయణ (స్క్రీన్-1), వెంకటేశ్వర: **దేవర**
శ్రీ సత్య: **జెంటిల్‌మెన్**
సత్యనారాయణ (స్క్రీన్-2): **మత్తు వదలరా**
షిర్డిసాయి: **సత్యం సుందరం**
అచ్యుతాపురం, న్యూస్‌టుడే:
శ్రీబాలాజీ విజిక్ సినిమా స్క్రీన్-1లో **సత్యం సుందరం**, స్క్రీన్-2లో **దేవర**

ఏనుగుతునిలో ఉచిత వైద్యశిబిరం

కశింకోట, న్యూస్‌టుడే: ఏనుగుతునిలో శుక్రవారం తెదేపా నాయకుడు గొంతిన చిరంజీవి ఆధ్వర్యంలో మెడికవర్ ఆసుపత్రి సహకారంతో వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 85 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. వైద్యాధికారులు జె.సాయిచంద్, ఎం.ఎస్.ఎల్.రాజు, తెదేపా నాయకులు జెర్రిపోతుల నూకనాయుడు, ఉప్పలం అప్పల నాయుడు, మలసాల నానాజీ, అంది సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

అధికారుల బాధ్యతల స్వీకరణ

అనకాపల్లి పట్టణం, మునగపాక, ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: అనకాపల్లిలో ఇద్దరు సబ్‌రిజిస్ట్రార్లు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. జాయింట్ సబ్‌రిజిస్ట్రార్-1గా పీవీఎస్ మాధవికుమారి, జాయింట్ సబ్‌రిజిస్ట్రార్-2 కె.నిరంజన్‌కుమార్ విధుల్లో చేరారు. మునగపాక తహసీల్దార్‌గా ఎస్.ఆది ఉమామహేశ్వరరావు, ఎలమంచిలి ఎంపీడీవోగా కొండలరావు బాధ్యతలు స్వీకరించారు. గ్రామాల్లో సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు.

కోటవురట్ల, న్యూస్‌టుడే: కోటవురట్ల తహసీల్దార్‌గా తిరుమల బాబు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. చోడవరం నుంచి బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు పనిచేసిన జానకమ్మ విశాఖపట్నం ఆర్డీవో కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు.

శిథిలావస్థలో భవనాలు.. ఆరుబయటే చదువులు

భయాందోళనలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

కోటవురట్ల, న్యూస్‌టుడే

ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు విద్యార్థులకు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి అందంగా తయారు చేశామని గొప్పలు చెప్పిన గత ప్రభుత్వం, పాత తరగతి పాఠశాలలను పట్టించుకోకపోవడంతో విద్యార్థులకు శాపంగా మారింది. పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయంతో బిక్కు బిక్కు మంటూ విద్యార్థులు చదువులు కొనసాగించాల్సిన పరిస్థితి. తంగేడు పంచాయతీ శివార్లోని ఈ పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు సుమారు 33 మంది విద్యార్థులు ప్రస్తుతం చదువుతున్నారు. రెండు భవనాలు నిర్మించి, నాలుగు తరగతి గదులు ఏర్పాటు చేశారు. అయితే భవనాలు నిర్మించి చాలా కాలం కావడంతో, శిథిలావస్థకు చేరాయి. దీంతో వర్షం కురిస్తే, స్లాబ్ చిమ్మడంతో, వర్షం నీరుతో తరగతి గదుల్లోకి వస్తోంది. శ్లాబ్ పెచ్చులూడి కిందకు రాలిపోతుండటంతో, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంతో, వరండాలోనే విద్యార్థులకు పాఠాలను బోధిస్తున్నామని ఉపాధ్యాయులు చెబుతున్నారు. వర్షం కురిస్తే, పాఠశాలను ఆనుకుని ఉన్న వీధి కాలువ నుంచి వర్షం నీరు పాఠశాల ఆవరణలోకి వచ్చేస్తుండటంతో, చెరువుల్లా తయారవుతోంది. విద్యార్థుల కోసం నిర్మించిన రెండు మరుగుదొడ్లు పాడైపోయి నిరుపయోగంగా ఉండటంతో, ఆరుబయటకు వెళ్లి కాలకృత్యాలు తీర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంటశాల భవనం కూడా వర్షం కురిస్తే కారుతుండటంతో, పుల్లల పొయ్యిపై, ఆరుబయటే వంట చేస్తున్నామని భోజన పథకం నిర్వాహకులు చెబుతున్నారు. భవనం శిథిలావస్థకు చేరిందని, నాడు-నేడు పథకం ద్వారా, నిధులు మంజూరు చేయాలని గత ప్రభుత్వంలోనే అధికారులకు వినతిపత్రాలు అందించామని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి తెలిపారు.



వరండాలో విద్యార్థులకు చదువు చెబుతున్న ఉపాధ్యాయులు

ఉన్నతాధికారులకు నివేదిక పంపాం: పాత తంగేడు పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరాయని, విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై ఉన్నతాధికారులకు నివేదిక పంపాం. ఉన్న భవనాలను తొలగించి, వాటి స్థానంలో నూతన భవనాలు నిర్మిస్తామన్నారు.
– రామారావు, జోష్, ఎంఈఓలు, కోటవురట్ల



ఆవరణలో వంటలు చేస్తున్న నిర్వాహకురాలు

భారీ వర్షం.. స్తంభించిన జనజీవనం

నక్కపల్లి, కోటవురట్ల, ఎస్.రాయవరం, న్యూస్‌టుడే

భారీ వర్షానికి జనజీవనం స్తంభించిపోయింది. శుక్రవారం ఎడతెరిపి లేకుండా వర్షం పడింది. నక్కపల్లిలోని చేనేత కాలనీ చుట్టూ నీరు చేరింది. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన నీటితో నక్కపల్లి, ఉపమాక జగనన్న కాలనీ కాలనీలకు దారి లేకుండాపోయింది. చెరువు పొంగిపోవడంతో నీరు కాలనీలోకి చేరింది. తోటలు, కూరగాయ పొలాల్లో నీరు భారీగా చేరింది. కోటవురట్లలో గంటపాటు కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. మండల పరిషత్ కార్యాలయం ఎదుట వర్షం నీరు వాగులా ప్రవహించింది. వర్షంతోపాటు ఈదురు గాలులు వీయడంతో, చెట్లు కొమ్మలు విరిగి తీగలపై పడి విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. ఎస్.రాయవరంలో కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. 42.8 మిల్లీ లీటర్ల వర్షపాతం నమోదైందని రెవెన్యూ సిబ్బంది తెలిపారు. అడ్డురోడ్డులో వర్షపునీరు రోడ్డుపైకి చేరడంతో రాకపోకలకు వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు.



పొంగి ప్రవహిస్తున్న శారదానది



ఎన్.నర్సాపురంలో నీట మునిగిన వంగతోట



కోటవురట్లలో..



అడ్డురోడ్డులో పాత జాతీయ రహదారిపై..

చంద్రబాబుతో ప్రగడ భేటీ!



ఎలమంచిలి, అచ్యుతాపురం, న్యూస్‌టుడే: తెదేపా ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు శుక్రవారం అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని కలిశారు. ఇటీవల నామినేటెడ్ పదవులు ప్రకటించిన జాబితాలో ప్రగడకు అవకాశం లభించలేదు. ఈ నేపథ్యంలో ప్రగడ విజయవాడలోని సీఎం చంద్రబాబును కలిశారు.

త్వరితగతిన వినతుల పరిష్కారం

నక్కపల్లి, న్యూస్‌టుడే: జనవాణి కార్యక్రమంలో స్వీకరిస్తున్న వినతులకు త్వరితగతిన పరిష్కారం లభిస్తుందని జనసేన రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్ అన్నారు. నక్కపల్లిలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన పలువురు నుంచి వినతులు స్వీకరించారు. వీటిని శాఖల వారీగా అధికారుల దృష్టికి తీసుకెళుతున్నామని, ఇక్కడ పరిష్కారం కాకుంటే మంత్రి అనిత దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కురందాసు అప్పలరాజు, ఆకేటి గోవిందరావు, పాము గణేష్, విత్తనాల అంజి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలపై అలుపెరుగని పోరాటం

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: రెవెన్యూ ఉద్యోగుల సమస్యలపై పోరాడిన తోట సుధాకర్ ప్రసాద్ వర్ధంతిని అనకాపల్లిలో శుక్రవారం నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పీవీ రత్నం, కార్యదర్శి శ్రీరామమూర్తి, కోశాధికారి వరహాలు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

నక్కపల్లి, న్యూస్‌టుడే: రహదారులపై ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అధికారులు, నాయకులు సూచించారు. ఎన్.హెచ్.ఎ.ఐ. ఆధ్వర్యంలో నక్కపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి విచ్చేసిన అధికారులు, నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న ప్రమాదాల్లో ఎక్కువమంది బాధితులవుతున్నది యువకులేనని అన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు సైకిళ్లను తొక్కే సమయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. అనంతరం ర్యాలీ చేశారు. ఎంపీడీఓ డి.సీతారామరాజు, తెదేపా మండల శాఖ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్, ఎంఈఓ కె.నరేష్, సేఫ్‌వే పీఎం నాగేశ్వరరావు, ప్రతినిధులు శ్రీనివాస్, సత్తిరాజు, అశోక్‌రాహుల్, అజయ్‌కుమార్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులను అరెస్టు చేయాలి

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: ఎసెన్షియా, సినర్జీస్ కంపెనీల యాజమానులను వెంటనే అరెస్టు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రొంగలి రాము, అచ్యుతాపురం కార్యదర్శి సోమునాయుడు డిమాండ్ చేశారు. అచ్యుతాపురం సెజ్‌లో 17 మంది మృతికి పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. ఇప్పటికైనా వీరిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని శుక్రవారం విలేకర్ల సమావేశంలో కోరారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన యాజమాన్యంపై చర్యలు తీసుకోవడం ఆలస్యం చేయడం వల్ల కార్మికుల భద్రత ప్రమాదంలో పడుతుందన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని, ప్రతి ఆరునెలలకి ఒకసారి ఆడిట్ చేపట్టాలన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు



పోటీలు పర్యవేక్షిస్తున్న ఎంఈఓ-2 సత్తిబాబు

ఎస్.రాయవరం: స్వర్ణాంధ్ర - 2047లో భాగంగా ఎస్.రాయవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఉప్పరాపల్లి పాఠశాల విద్యార్థిని తుమ్మపాల శ్రావణి, ఎస్.రాయవరం విద్యార్థిని తన్నీరు హేమలత, ధర్మవరం-అగ్రహారం విద్యార్థిని కోన దుర్గశ్రీ జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఇన్‌ఛార్జి ఎంఈఓ-2 సత్తిబాబు ఈ పోటీలను పర్యవేక్షించారు.

మునగపాక, న్యూస్‌టుడే: మునగపాక ఎంఆర్‌సీ కార్యాలయంలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో బుద్ధ భవ్యశ్రీ (నాగులాపల్లి), పొలమరశెట్టి వీర రమ్య (తోటాడ), బి. వర్షిత ప్రతిభ కనబరిచారు. ఎంఈఓలు వేణుగోపాల్, బుద్ధ శివనాయుడు, సీఆర్‌పీలు పాల్గొన్నారు. ☛ వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శ్రీవెంకటేశ్వర గీతా ప్రచార సమితి ఆధ్వర్యంలో ఇటీవల వ్యాసరచన పోటీల్లో శరగడం జగదీష్, శరగడం హరీష్, నాగేంద్ర ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచారు. విజేతలకు కన్వీనర్ శరగడం పరదేశినాయుడు నగదు బహుమతులు అందజేశారు.

మత్స్యకారుల ఆందోళన

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: శుద్ధి చేయకుండా రసాయన వ్యర్థాలను సముద్రంలోకి విడుదల చేస్తూ గంగమ్మను కాలకూటవిషంగా మార్చేస్తున్నారని మత్స్యకార నాయకుడు చేపల తాతయ్య ఆందోళన వ్యక్తం చేశారు. పూడిమడక తీరానికి కొట్టుకొచ్చిన చేపలతో శుక్రవారం వీరు ఆందోళన చేపట్టారు. వర్షాలు కురిసిన సమయాల్లో సెజ్‌లో ప్రమాదకరమైన రసాయనాలను విడుదల చేస్తున్నారని, చేపలు, తాబేళ్లు, తిమింగళాలు చనిపోతూ తీరానికి కొట్టుకొస్తున్నాయన్నారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం జోక్యం చేసుకొని మత్స్యకారులకు న్యాయం చేయాలని కోరారు.



చనిపోయిన చేపలతో మత్స్యకారుల నిరసన

గజానికో గతుకు.. ప్రయాణం బితుకు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

చినుకు పడితే అనకాపల్లిలో దారులు దారుణంగా తయారవుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో రహదారుల మరమ్మతులపై నిర్లక్ష్యం ప్రజలకు ఇబ్బందులకు కలిగిస్తోంది. అనకాపల్లి-చోడవరం రోడ్డు ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోలేదు. అనకాపల్లి, తుమ్మపాల, దర్జీనగర్, బవులవాడ, మామిడిపాలెం పొంతాల్లో రహదార్లపై గోతులు పడి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. తరచూ ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఈ నెలాఖరుకల్లా మరమ్మతు పనులు చేపడతామని ఆర్అండ్‌బీ అధికారులు చెప్పినా ఆ దిశగా సన్నాహాలు చేపట్టలేదు. ఎన్‌డీబీ నిధులతో అనకాపల్లి-చోడవరం రహదారి పనులు చేపట్టాల్సి ఉంది. అనకాపల్లి రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారి గోతులుగా మారింది. కూటమి ప్రభుత్వ హయాంలో రహదారులు మెరుగుపడతాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



మామిడిపాలెం సమీపాన రహదారి దుస్థితి



బవులవాడ రహదారిలో..



అనకాపల్లి రైల్వేస్టేషన్ రోడ్డు..

అణుకు పాఠశాల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న గిరిధర్

కోటవురట్ల, న్యూస్‌టుడే: గొట్టివాడ శివారు అణుకులో ఏర్పాటు చేసిన ఎన్ఆర్ఎస్‌టీసీ పాఠశాలను శుక్రవారం జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ కోఆర్డినేటర్ గిరిధర్, శకుంతల పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాన్ని తెలుసుకోవడానికి పాఠ్యాంశంలోని పలు ప్రశ్నలు అడిగారు. పాఠశాలలో 18 మంది విద్యార్థులు చదువుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం గొట్టివాడ ప్రాథమిక పాఠశాల నుంచి డిప్యుటేషన్‌పై ఉపాధ్యాయుడిని నియమించినట్లు తెలిపారు.

స్వయం ఉపాధితో మహిళల ఆర్థికాభివృద్ధి



శిక్షణ పొందుతున్న మహిళలతో బీఎస్‌గుప్తా

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: స్వయం ఉపాధి ద్వారా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని రోటరీక్లబ్ పూర్వ అధ్యక్షులు బి.ఎస్.గుప్తా కోరారు. పట్టణంలోని న్యూకాలనీలో రోటరీ క్లబ్ ఆధ్వర్యాన శుక్రవారం కోల్ ఇండియా సీఎస్ఆర్ నిధులతో 15 ఆధునిక కుట్టుమిషన్లను అందించారు. ఈసందర్భంగా శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. క్లబ్‌లో 15 రోజుల పాటు ఉచిత శిక్షణ అనంతరం మిషన్లు ఉచితంగా అందిస్తామన్నారు. క్లబ్ అధ్యక్షులు సరిపల్లి రాజేష్, కార్యదర్శి దేవర అనిల్, కోశాధికారి గ్రంధి సత్యేంద్ర, కడిమిశెట్టి సతీష్, బుద్ధ రమణాజీ, బీజేనాయుడు, గౌరీపతి, శిక్షకురాలు దుర్గాదేవి పాల్గొన్నారు.

చినదొడ్డిగల్లులో సామూహిక సీమంతాలు



సీమంతాల కార్యక్రమంలో అధికారులు, నాయకులు

నక్కపల్లి, న్యూస్‌టుడే: చినదొడ్డిగల్లులో సామూహిక సీమంతాల కార్యక్రమం శుక్రవారం వేడుకగా సాగింది. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్లంతా ఇక్కడ పోషకాహార ప్రదర్శన ఏర్పాటు చేశారు. సుమారు 30 మంది మహిళలకు సీమంతాలు, పలువురు చిన్నారులకు అన్నప్రాసన ఏర్పాటు చేయగా ఎంపీడీఓ డి.సీతారామరాజు, తెదేపా మండల శాఖ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్, ప్రధాన కార్యదర్శి వెలగా శ్రీను, తదితరులు ప్రారంభించారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యానికి ఎన్నో చర్యలు చేపడుతుందన్నారు. సీడీపీఓ శ్రీలత, సర్పంచి బొల్లం చంద్రరావు, నాయకులు తోట సత్తిబాబు, వెలగా బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవిపేట (అనకాపల్లి), న్యూస్‌టుడే: పని ప్రదేశాల్లో మహిళల రక్షణకు ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తీసుకువచ్చాయని ఏసీడీపీఓ శశికళ పేర్కొన్నారు. పట్టణంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సీడీపీవో ప్రభావతి, ఏఎస్ఐ ఎన్.మణికుమారి, సూపర్‌వైజర్ నిర్మలా కుమారి, హెచ్ఎం హసీనా, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ఎలమంచిలి, న్యూస్‌టుడే: తమ సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గనిశెట్టి ఏసుదాసు కోరారు. శుక్రవారం ఎలమంచిలి పట్టణంలోని మున్సిపల్ కార్మికులతో ఆయన సమావేశం నిర్వహించారు. కార్మికులకు ఇవ్వాల్సిన సబ్బులు, నూనెలు ఇవ్వలేదన్నారు. గతంలో ఇచ్చిన హామీలు ఇంత వరకూ నెరవేర్చలేదన్నారు. కార్మికులందరికీ ఇళ్లస్థలాలు ఇవ్వాలని కోరారు. అనంతరం యూనియన్ నాయకులు కార్మికులు మున్సిపల్ కమిషనర్ బాకూరి ప్రసాదరాజుకు వినతిపత్రం అందించారు. నాయకులు వెంకటరమణ, నూకరాజు, నాగరాజు, చంద్రబాబు, మహేష్, అదిమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

అభివృద్ధికి సహకరించండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుందరపు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: అచ్యుతాపురాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ తెలిపారు. ఎంపీపీ కోన సంధ్య అధ్యక్షతన శుక్రవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్పంచులు రాజకీయాలకు అతీతంగా గ్రామాభివృద్ధికి సహకరించాలన్నారు. పూడిమడక మత్స్యకారులకు రావాల్సిన పరిహారం చెక్కులను అందించాలని ఎంపీటీసీ సభ్యురాలు కోరారు. భోగాపురం, జంగుళూరు, మడుతూరుల్లో కిడ్నీ వ్యాధి వ్యాప్తిపై సర్వే నిర్వహిస్తున్నామని దీనికి కారణాలు తెలుసుకొని నివారణ చర్యలు తీసుకుంటామన్నారు. మోసయ్యపేట, రామన్నపాలెం, రాజానపాలెం గ్రామాలకు పంచాయతీ భవనాలు లేవని వీటి నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలని సర్పంచి డ్రీమ్స్ నాయుడు కోరారు. దుప్పితూరు తాగునీటి పథకం మెట్లు కూలిపోయాయని సర్పంచి దేశంశెట్టి శంకరరావు వివరించారు. ఇన్‌ఛార్జి తహసీల్దార్ నీరజ, జడ్పీటీసీ సభ్యులు లాలం రాము, నర్మాలకుమార్ పాల్గొన్నారు.

ముంపు సమస్య పరిష్కరించండి

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: కొద్దిపాటి వర్షాలు పడినా జలమయం అవుతున్న అనకాపల్లిని కాపాడాలని సీపీఎం పార్టీ కోరింది. ఈ మేరకు శుక్రవారం సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ ఆధ్వర్యంలో నాయకులు అనకాపల్లి ఆర్టీసీ బస్‌స్టేషన్ ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చినుకులు పడినా బస్‌స్టేషన్ జలాశయంగా మారిపోతోందన్నారు. ప్రయాణికులు, సిబ్బంది, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైల్వే క్రింది వంతెన, సుంకరమెట్ట మార్గం, సత్యనారాయణపురం, కొత్తూరు పంచాయతీల పరిధిలోని పలు ప్రాంతాలు వర్షాలు పడితే ఇంట్లో నుంచి ఎవరూ బయటకు రాలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. నాయకులు తెలయ్యబాబు, బొప్పే ఉమామహేశ్వరరావు, బి.నూక అప్పారావు, దాకారాపు శ్రీనివాసరావు, పలకా సత్యనారాయణ, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ బస్‌స్టేషన్‌ను చూపిస్తున్న నాయకులు

సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయరూ!

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: కొత్తూరు కళాశాల కూడలి ప్రమాదాలకు మారింది. జాతీయ రహదారిపై మలుపుతో వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. తరచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. పెరుగుతున్న రద్దీని దృష్టిలో పెట్టుకొని కళాశాల కూడలిని విస్తరించాలని, సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



కొత్తూరు కళాశాల కూడలిలో ఇదీ పరిస్థితి..

శిథిలావస్థలో నీటి పథకం!

ఎలమంచిలి, న్యూస్‌టుడే

ఎలమంచిలి మున్సిపాలిటీ పరిధిలోని కొక్కిరాపల్లిలో రక్షిత మంచినీటి పథకం ట్యాంక్ శిథిలావస్థకు చేరింది. దీని పిల్లర్లు దెబ్బతిని సగం ఊడిపోయాయి. మెట్లన్నీ కూలిపోయాయి. పక్కనే ఇనుప గొట్టాలతో వేసి మెట్లు తుప్పు పట్టాయి. ట్యాంక్ కారిపోతోంది. దీనికి పక్కనే మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఉంది. ఉపాధ్యాయులు హెచ్చరిస్తున్నా పిల్లలు ఆడుకోవడానికి, కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఇటువైపే వస్తున్నారు. గ్రామంలో పూర్తి స్థాయిలో కుళాయిలు లేవు. మున్సిపాలిటీలో వైకాపా పాలకవర్గం అధికారంలో ఉంది. 25 మున్సిపల్ కౌన్సిలర్లలో ఒక్క కొక్కిరాపల్లి కౌన్సిలర్ మాత్రమే తెదేపాకు చెందినవారు. ఈ కారణంగా వైకాపా హయాంలో ఈ గ్రామ అభివృద్ధిపై దృష్టి సారించలేదు. మున్సిపల్ అధికారులు స్పందించి ఇక్కడ కొత్త ట్యాంక్ నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



కొత్త ట్యాంక్ నిర్మిస్తాం

కొత్త ట్యాంకు నిర్మిస్తాం. గ్రామంలో ట్యాంక్ ప్రమాదకరంగా మారిందని గ్రామస్థులు తమ దృష్టికి తెచ్చారు. గ్రామంలో పర్యటించి పరిస్థితిని తెలుసుకుంటాను. ప్రస్తుతానికి మరమ్మతులు చేయిస్తా!
– బాకూరి ప్రసాదరాజు, కమిషనర్

శారదానగర్‌లో కాలువ విస్తరణ

కొత్తూరు(అనకాపల్లి): కొత్తూరులోని కాలువల్లో వ్యర్థాలను తొలగించే పనులు ప్రారంభించారు. ముంపు సమస్య పరిష్కారంలో భాగంగా మూడో వీధి వద్ద కాలువను విస్తరిస్తున్నారు. ఈ పనులను స్థానిక ప్రతినిధులు పరిశీలించారు.

పీలాకు సత్కారం

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణ ఆర్థిక, మౌలిక సదుపాయాల సంస్థ ఛైర్మన్‌గా నియమితులైన పీలా గోవింద్ సత్యనారాయణను శుక్రవారం పెందుర్తిలో కొత్తూరు నరసింగరావుపేట మాజీ సర్పంచి కసిరెడ్డి సత్యనారాయణ తదితరులు సత్కరించారు.

బాల్య వివాహాలు ప్రోత్సహిస్తే చర్యలు

కశింకోట: బాల్య వివాహాలను ప్రోత్సహించిన వారికి కఠిన చర్యలు తప్పవని ఏఎస్సై రమణమ్మ హెచ్చరించారు. శుక్రవారం నిర్వహిస్తున్న అవగాహనా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు.

పురుషోత్తపురం విద్యార్థుల ప్రతిభ

ఎలమంచిలి/ గ్రామీణం, పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పురుషోత్తపురం విద్యార్థులు ప్రతిభ కనబరిచి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఇన్‌ఛార్జి హెచ్ఎం మల్లిపాటి సత్యనారాయణ తెలిపారు. బాలికల విభాగంలో అండర్- 17లో కబడ్డీ, వాలీబాల్, అండర్-14లో షటిల్‌లో ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. యోగా, 100, 200, 400 మీటర్లు హైజంప్ విభాగాల్లో ప్రతిభ కనబర్చారన్నారు. పీడీ సూర్యప్రకాశరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఎస్.నర్సాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో అండర్ 14, 17 ఆటల పోటీలను కూటమి నాయకులు పెదిరెడ్డి చిట్టిబాబు, గొర్రెల రాజుబాబు, చించలపు పద్దు ప్రారంభించారు. మొదటిరోజున కబడ్డీ, ఖోఖో, చదరంగం, యోగా, షటిల్, వాలీబాల్ క్రీడలు జరిగాయి. సర్పంచి మంచాల అనిత, తోట నగేష్, మజ్జూరి నారాయణరావు, గుటూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

✦ భగత్‌సింగ్ జయంతి ఉత్సవాలు పురస్కరించుకుని ఎలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు శివాజీ, బాలాజీ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ కళాశాల నుంచి 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



ఎస్.నర్సాపురంలో కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు



పురుషోత్తపురం విద్యార్థులతో ఉపాధ్యాయులు

దుర్గాదేవి ఉత్సవాలకు శ్రీకారం

లక్ష్మీదేవిపేట (అనకాపల్లి), న్యూస్‌టుడే: పట్టణంలోని జనసేన కార్యాలయంలో శుక్రవారం దుర్గాదేవి పందిరిరాట ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండపం ఏర్పాటు చేసి తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు చేయనున్నారు. నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



రాట వేస్తున్న భక్తులు, నాయకులు

మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి - 80085 74722
ఎలమంచిలి - 80085 74726
పాయకరావుపేట - 80085 74749

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

?: పూల్‌బాగ్ రోడ్డులోని అంబేడ్కర్ కాలనీలో మట్టిరోడ్డుతో ఇబ్బందులు పడుతున్నాం. రహదారి పనులు చేపట్టండి.
– ప్రసాద్, అనకాపల్లి

✓: రహదారి పనులు చేపట్టి సమస్యను పరిష్కరిస్తాం. – సుమిత్ర, ఏఈ

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

పోషకాహార అవశ్యకతను గుర్తించాలి



కొత్తకోటలో ఆహార పదార్థాల ప్రదర్శన

రావికమతం, న్యూస్‌టుడే: పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా కొత్తకోట సెక్టారు పరిధిలో శుక్రవారం ఆహార పదార్థాల ప్రదర్శన నిర్వహించారు. 25 అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన కార్యకర్తలు తీసుకువచ్చిన పదార్థాలను ప్రదర్శనలో ఉంచారు. పోషకాహార అవశ్యకతను గుర్తించాలని గర్భిణులు, బాలింతలకు సూచించారు. సూపర్‌వైజర్ విజయలక్ష్మి, రత్నకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తదానం నలుగురికి ప్రాణదానం

చోడవరం పట్టణం, న్యూస్‌టుడే: రక్తదానం చేస్తే నలుగురికి ప్రాణదానం చేసినట్లవుతుందని ఎమ్మెల్యే రాజు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం, విశ్వనాథ్ బ్లడ్ ఇనిస్టిట్యూట్, కమ్యూనిటీ హెల్త్ చోడవరం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం జరిగింది. ఎమ్మెల్యే రాజు జ్యోతి ప్రజ్వలన చేసి శిబిరాన్ని ప్రారంభించారు. 80 మంది రక్తదానం చేశారు. ప్రిన్సిపల్ కిరణ్‌కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు రత్నకుమారి, పైడమ్మ, మాల్యాద్రి, సుధీర్, కృష్ణారావు, మల్లిబాబు, లక్ష్మీమంగమ్మ, సూర్యావతి, రాధాకృష్ణ పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న విద్యార్థులు, వెనుక అధ్యాపకులు

క్రీడా వసతుల మెరుగుకు అడుగులు

సభాపతి అయ్యన్నపాత్రుడు ఆదేశాలతో కదలిక



ఎన్టీఆర్ మినీ స్టేడియం

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే

రెవెన్యూ డివిజన్ కేంద్రమైన నర్సీపట్నంలో క్రీడా వసతులు మెరుగుపర్చేందుకు కార్యాచరణ సిద్ధమవుతోంది. రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులు ఉన్నప్పటికీ తగినన్ని వసతుల్లేవు. కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో అవసరమైన సదుపాయాలన్నీ సమకూరేలా శాసన సభాపతి అయ్యన్నపాత్రుడు దృష్టిసారించారు.

క్రీడా శిక్షణ కేంద్రానికి హామీ



ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో రూ.2 కోట్లతో ఇండోర్ స్టేడియం నిర్మించేందుకు 2018లో అప్పటి మంత్రి కొల్లు రవీంద్ర శంకుస్థాపన చేశారు. గుత్తేదారు పనులు చేపట్టారు. ఎన్నికల కోడ్ రావడంతో పనులు ముందుకు వెళ్లలేదు. వైకాపా ప్రభుత్వం ఈ పనులను కొనసాగించలేదు. స్టేడియం కోసం ఎంపిక చేసిన స్థలంలో ఇప్పుడు క్రీడా శిక్షణ కేంద్రం, ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయాలని సభాపతి నిర్ణయించారు. ఇందుకయ్యే నిధులు కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదల చేయిస్తానని ఎంపీ సీఎం రమేశ్ హామీ ఇచ్చారు. ఇటీవల అధికారులతో కలిసి సభాపతి ఈ ప్రదేశాన్ని పరిశీలించారు.

ఇండోర్ స్టేడియం




నర్సీపట్నం నడిబొడ్డున అబీద్ కూడలిలో ఎన్టీఆర్ మినీస్టేడియం ఒక్కటే ప్రస్తుతం అందరికీ అందుబాటులో ఉంది. వర్షం వస్తే ఆవరణలో నీరు నిలుస్తోంది. వాకింగ్ ట్రాక్ దెబ్బతింది. డ్రైనేజీ పూడిపోయింది. స్టేడియంలో వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, క్రికెట్ ఆడుకోవడంతోపాటు బాక్సింగ్ శిక్షణకు పలువురు వస్తుంటారు. దీన్ని ఇండోర్ స్టేడియంగా మార్చాలని వారంతా కోరుతున్నారు.

గ్యాలరీగా బాక్సింగ్ రింక్



ప్రాంతీయ ఆసుపత్రి ఎదురుగా నందనవనం పార్కులో స్కేటింగ్ రింక్ ఉంది. దీని చుట్టూ స్టీల్ రెయిలింగ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోతున్నారు. ఈ పార్కులోనే ఏడు నెలల కిందట బాక్సింగ్ రింక్ ఏర్పాటుకు కలెక్టర్ రూ.60 లక్షలు కేటాయించారు. భవన నిర్మాణానికి రూ.45 లక్షలు ఖర్చు చేయాలని నిర్ణయించి టెండర్లు ఖరారు చేశారు. రూ.4 లక్షలు వెచ్చించి స్తంభాల వేసేందుకు ఊచలు అమర్చారు. ఎన్నికల కోడ్ కారణంగా పనులు ఆగిపోయాయి. కోడ్ ముగిసిన తర్వాత పనులు మొదలుకాలేదు. బాక్సింగ్ రింక్ చిన్నదిగా కాకుండా విశాలంగా నిర్మించాలని, అనువైన స్థలాన్ని పరిశీలించాలని సభాపతి అయ్యన్న యోచిస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ బాక్సింగ్ రింక్ కోసం నిర్మించిన స్తంభాలను గ్యాలరీగా మార్చాలని అధికారులకు ఆదేశించారు.

20 ఎకరాలు అవసరం



జిల్లాలో క్రీడా సదుపాయాల కల్పనకు 20 ఎకరాలు కేటాయించాలని కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. హాకీ, కబడ్డీ, ఖోఖో, స్విమ్మింగ్, పరుగు, వాలీబాల్ తదితర క్రీడలకు అవసరమైన వసతులు కల్పించాలన్న ప్రతిపాదనలు ఉన్నాయి. అనకాపల్లిలో బహుళ ప్రయోజన ఓపెన్ స్టేడియం, ఇండోర్ స్టేడియం నిర్మించే ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉంది.

– రమణ, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి

శిథిల భవనానికి కొత్త రూపు

స్పందనకు వందనం

● 'ఈనాడు' కథనంతో నిధుల మంజూరు ● యుద్ధప్రాతిపదికన మరమ్మతు



గడబపాలెం పాఠశాల భవనం



'ఈనాడు'లో ప్రచురితమైన కథనం

కృష్ణదేవిపేట, న్యూస్‌టుడే: సమస్య ఏదైనా స్పందించే హృదయముంటే త్వరగా పరిష్కారమవుతుంది. పాతమల్లంపేట పంచాయతీ శివారు ఎస్.గడబపాలెంలో శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనమే ఇందుకు నిదర్శనం. గొలుగొండ మండల కేంద్రానికి 12 కి.మీ. దూరంలో ఉన్న ఎస్.గడబపాలెం పాఠశాల భవనం వర్షాలకు కారుతోంది. స్లాబు పెచ్చులూడి పడుతున్నాయి. 25 మంది విద్యార్థులు ఉండగా... వారి తల్లిదండ్రులు చందాలు వేసుకుని రూ.7 వేలతో టార్పలిన్ కొనుగోలు చేసి భవనంపై కప్పారు. కొన్నాళ్లకు సమస్య మళ్లీ మొదటికొచ్చింది. ఈ పరిస్థితుల్లో పిల్లలు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. గత వైకాపా ప్రభుత్వం నాడు-నేడులో ఈ పాఠశాలను చేర్చలేదు. 'బిక్కుబిక్కు చదువులు' శీర్షికన పాఠశాల దుస్థితిపై ఆగస్టు 19న 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన కలెక్టర్ తక్షణం మరమ్మతులు చేపట్టాలంటూ అధికారులను ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ అధికారిణి వెంకటలక్ష్మమ్మ మండల పరిషత్తు, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పాఠశాలను పరిశీలించి నివేదిక ఇచ్చారు. ఆ వెంటనే మండల పరిషత్తు నిధులు రూ.1.9 లక్షలు కేటాయించారు. వీటికి అదనంగా పంచాయతీ నిధులు కలిపి పాఠశాల భవనానికి మరమ్మతు చేసినట్లు పీఆర్ డీఈ ఈశ్వరరావు చెప్పారు. సమస్య పరిష్కారం కావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అదనపు భవనానికి కృషి



పాతమల్లంపేట పంచాయతీలో గత ప్రభుత్వం సమస్యలను పట్టించుకోలేదు. పంచాయతీ నిధులను ప్రధాన సమస్యల పరిష్కారానికి ఖర్చు చేస్తున్నాం. అదనపు భవన నిర్మాణానికి నిధుల మంజూరు కోరుతూ సభాపతి అయ్యన్నపాత్రుడు దృష్టికి తీసుకెళ్లాం. – ఆదిలక్ష్మి, సర్పంచి

తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీకన్య ఆడి1: **సత్యం సుందరం,** ఆడి2: ఆడి3: **దేవర,** ఆది4: **దేవర, మత్తు వదలరా,** రాజు: **దేవర, సత్యం సుందరం,** బంగార్రాజు: **దేవర**
చోడవరం: శ్రీసాయిలక్ష్మి: **సత్యం సుందరం,** సాయిలక్ష్మి: **మత్తు వదలరా,** పూర్ణా: **దేవర**

అ వీ ఇ వీ

ఎడ్లబళ్ల పరుగు, క్విజ్ పోటీలు రేపు

చీడికాడ, న్యూస్‌టుడే: దిబ్బపాలెంలో వరసిద్ధి వినాయక నిమజ్జనోత్సవం సందర్భంగా ఆదివారం జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు, క్విజ్ పోటీలు జరగనున్నాయి. విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

నర్సీపట్నం, న్యూస్‌టుడే: భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని ఎస్ఎఫ్ఐ నాయకులు ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల విద్యార్థులు 300 మందికి వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. గీతాకృష్ణ, రాజు, ఐద్వా నాయకులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి సత్యారావుకు నివాళి

చోడవరం, న్యూస్‌టుడే: వార్డు సభ్యుడిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి మంత్రిగా ఎదిగిన బలిరెడ్డి సత్యారావు జీవితం నేటితరం నాయకులకు ఆదర్శనీయమని పలువురు కొనియాడారు. సత్యారావు ఆరో వర్ధంతి సందర్భంగా ఫకీర్‌సాహెబ్‌పేటలో ఆయన విగ్రహానికి శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ కాసు, నాయకులు తమ్మునాయుడు, సత్యారావు, ఆనందేశ్వరరావు, ఏవీ సత్యారావు, ఎర్రినాయుడు, నెహ్రూబాబు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చెరకు రైతులకు బకాయిలు చెల్లించాలి

కె.కోటపాడు, న్యూస్‌టుడే: టన్ను చెరకుకు రూ.4 వేలు మద్దతు ధర చెల్లించాలని రైతు సంఘం చోడవరం ప్రాంత కార్యదర్శి సూర్యనారాయణ శుక్రవారం డిమాండు చేశారు. రైతులకు చెల్లించాల్సిన రూ.7 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు.

విద్యుదాఘాతంతో రైతుకు తీవ్ర గాయాలు

రోలుగుంట, న్యూస్‌టుడే: బుచ్చెంపేటకు చెందిన రైతు శెట్టి రాంబాబు శుక్రవారం విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. ఎన్.కొత్తూరు శివారు గొల్లపేట సమీపంలోని పొలానికి వెళ్లగా.. తెగిపడిన తీగ కాలికి తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. సమీపంలోని రైతులు వెంటనే నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రికి అక్కడ్నుంచి విశాఖ కేజీహెచ్‌కి తరలించారు.

గిరిజన గ్రామాల్లో దోమతెరల పంపిణీ

కృష్ణదేవిపేట, న్యూస్‌టుడే: దోమకాటుకు గురై గిరిజనులు జ్వరాలు బారినపడకుండా ముందస్తు చర్యల్లో భాగంగా దోమతెరలు పంపిణీ చేస్తున్నట్లు గొలుగొండ, చీడిగుమ్మల వైద్యాధికారులు శ్యామ్‌కుమార్, ధనుంజయ్ తెలిపారు. కొత్తయల్లవరం, పాతమల్లంపేట, ఏటిగైరంపేట సచివాలయాల పరిధిలో సర్పంచులు ఆదిలక్ష్మి, రాంబాబు శుక్రవారం వీటిని పంపిణీ చేసారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాడితోనే రైతులకు ఆదాయం

చోడవరం, న్యూస్‌టుడే: వ్యవసాయానికి అనుబంధంగా పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకుంటే రైతులకు ఆదాయం వస్తుందని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. రాయపురాజుపేటలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం పశువులకు శిబిరం జరిగింది. శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రాజు పాడి రైతులకు మినరల్ మిక్చర్, మందులు అందజేశారు. పశుసంవర్ధక శాఖాధికారి రామ్మోహనరావు, పశుగణాభివృద్ధి సంస్థ ఈవో ప్రసాదరావు, డీడీ చంద్రశేఖర్, సర్పంచులు రామునాయుడు, ఈశ్వరరావు, అప్పారావు, నాయకులు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



పాడి రెతులకు మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు



తాతయ్యబాబుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న కూటమి నాయకులు

తాతయ్యబాబుకు కూటమి నేతల సత్కారం

చోడవరం, బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: గృహ నిర్మాణ సంస్థ ఛైర్మన్‌గా నియమితులైన తెదేపా జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబును కూటమి నాయకులు శుక్రవారం సత్కరించారు. వడ్డాదిలోని ఆయన నివాసంలో చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం మండలాలకు చెందిన నాయకులు శ్రీనివాస్, ముత్యాలనాయుడు, రమణమూర్తి, రాజేష్, సత్యనారాయణ, పీవీ రాజు, అప్పారావు, కేవీఎన్ రాజు, మోదినాయుడు, అప్పలనాయుడు, శ్రీను, నాగరాజు, నాయుడు, వెంకటరమణ సత్కరించిన వారిలో ఉన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు ప్రారంభం

నర్సీపట్నం/అర్బన్, న్యూస్‌టుడే: పెదబొడ్డేపల్లి బాలుర గురుకుల పాఠశాల ఆవరణలో నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ తెదేపా కౌన్సిలర్ చింతకాయల రాజేష్ క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. మండల స్థాయిలో గెలుపొందిన అండర్-14, 17 విభాగాల్లో 80 మంది బాలురు పోటీల్లో పాల్గొన్నారు. వాలీబాల్, కబడ్డీ, షటిల్‌బ్యాడ్మింటన్‌లో విజేతలుగా నిలిచి జిల్లా స్థాయికి ఎంపికైన క్రీడాకారులకు పతకాలు అందజేశారు. బాలికలకు శనివారం పోటీలు జరుగుతాయని పీఈటీ వినోద్ చెప్పారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్, గ్రామీణ సీఐ రేవతమ్మ, ఎంఈఓలు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కౌన్సిలర్ రాజేష్



వాలీబాల్ పోటీ విజేతలు



చౌడువాడలో పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, పైలా ప్రసాదరావు తదితరులు

కె.కోటపాడు: చౌడువాడ జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో మాడుగుల నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. నాలుగు మండలాల్లోని 40 పాఠశాలల నుంచి 400 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పోటీలను ప్రారంభించారు. పాఠశాలను సొంత నిధులతో అభివృద్ధి చేస్తున్న గణపతిరాజు లక్ష్మీనర్సింహరాజును సన్మానించారు. సర్పంచి ఎరుకునాయుడు, ఉప సర్పంచి మణికంఠ, కూటమి నాయకులు పైలా ప్రసాదరావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వం పైసా ఇవ్వలేదు

దేవరాపల్లి, న్యూస్‌టుడే: వాలాబు పంచాయతీలో గిరిజన గ్రామాలకు రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి రుణపడి ఉంటామని గిరిజనులు పేర్కొన్నారు. సర్పంచి పోడెల వెంకటలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం వారంతా సమావేశమయ్యారు. సర్పంచి మాట్లాడుతూ.. తెదేపాకు చెందిన అభ్యర్థిని గెలిపించారన్న అక్కసుతో పంచాయతీకి వైకాపా ప్రభుత్వం ఐదేళ్లలో పైసా నిధులు ఇవ్వలేదన్నారు. ఆసుపత్రులకు వెళ్లేందుకు రోడ్డు సదుపాయంలేక గర్భిణులు, బాలింతలు ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. ఉప సర్పంచి ఈశ్వరమ్మ, బుజ్జి, జగన్నాథందొర, అప్పన్నదొర పాల్గొన్నారు.



సమావేశంలో సర్పంచి వెంకటలక్ష్మి తదితరులు

అధికారుల బాధ్యతల స్వీకరణ

నర్సీపట్నం అర్బన్, మాకవరపాలెం, న్యూస్‌టుడే: ఇటీవల బదిలీపై మండలాలకు వచ్చిన అధికారులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నర్సీపట్నం తహసీల్దార్‌గా ఎల్.రామారావు, ఎంపీడీవోగా కె.ఉషశ్రీ, ఆర్‌అండ్‌బీ డీఈఈగా విద్యాసాగర్, గనుల శాఖ ఏడీగా జి.శివాజీ, సహాయ జియాలజిస్ట్‌గా వి.వి.రమణ, మాకవరపాలెం డీటీగా పి.సోమశేఖర్, మండల పరిషత్తు కార్యాలయ జూనియరు అసిస్టెంట్‌గా మురళీమోహన్ విధుల్లో చేశారు.

దేవరాపల్లి, మాడుగుల గ్రామీణం, చీడికాడ: దేవరాపల్లి తహసీల్దారు పి.లక్ష్మీదేవి, ఉప తహసీల్దారుగా కె.అప్పారావు, మాడుగుల తహసీల్దారుగా కె.రమాదేవి, చీడికాడ ఉప తహసీల్దారుగా సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు. తెదేపా నాయకులు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు

బుచ్చెయ్యపేట, రోలుగుంట: బుచ్చెయ్యపేట తహసీల్దారుగా ఎం.లక్ష్మి విధుల్లో చేరారు. కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు, పలువురు నాయకులు ఆమెకు స్వాగతం పలికారు. ఉపాధి హామీ పథకం రోలుగుంట మండల ఏపీవోగా ఈశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి ఏపీఓ సూర్యమణి గొలుగొండకు బదిలీ అయ్యారు.

ఏఈలు బదిలీ: జలవనరుల శాఖలో పలువురు సహాయ ఇంజినీర్లు బదిలీ అయ్యారు. కల్యాణపులోవ జలాశయం (కొత్తకోట సెక్షన్) ఏఈ సత్యనారాయణదొరను చోడవరానికి, అక్కడి ఏఈ శ్రీదేవిని విశాఖకు బదిలీ చేశారు. గొలుగొండ మండలం కృష్ణదేవిపేట ఏఈ సూర్యనారాయణను కొత్తకోటకు బదిలీచేశారు. తాండవ జలాశయానికి సంబంధించి నాతవరం ఏఈ శ్యామ్‌కుమార్‌ను నర్సీపట్నం బదిలీచేయగా నర్సీపట్నం ఏఈ వినయ్‌కుమార్‌ను మునగపాకకు బదిలీచేశారు. తాండవ జలాశయం ఏఈ రామకృష్ణను ఎలమంచిలికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

కళ్యాణపులోవ నీరు విడుదల

రావికమతం, న్యూస్‌టుడే: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కల్యాణపులోవ జలాశయంలో నీటి నిల్వలు గణనీయంగా పెరిగాయి. గరిష్ఠ నీటి మట్టం 460 అడుగులు కాగా శుక్రవారం 458.80 అడుగులకు చేరింది. ఎగువ ప్రాంతాల నుంచి 50 క్యూసెక్కుల నీరు వస్తుండగా.. సాయంత్రం రెండు గేట్లను ఎత్తి వంద క్యూసెక్కుల నీటిని సర్పానదికి విడుదల చేసినట్లు ఏఈ సత్యనారాయణ దొర చెప్పారు. నదీ పరివాహక ప్రాంతాలైన రావికమతం, రోలుగుంట, మాకవరపాలెం మండలాల పరిధిలోని రైతులను అప్రమత్తం చేసినట్లు పేర్కొన్నారు.



దిగువకు విడుదలవుతున్న నీరు

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

రోలుగుంట, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర 2047 పేరుతో శుక్రవారం మండల స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు శనివారం బహుమతులు అందజేశారు. వ్యాసరచన పోటీల్లో కేజీబీవీ విద్యార్థులు వై.అమృత, వి.వాసవి మొదటి రెండు స్థానాల్లో, వక్తృత్వంలో ఆర్.మోహన్‌గాంధీ, ఎన్.ఆకాష్‌లు విజేతలుగా నిలిచారు. ఎంఈఓ జగ్గారావు, రోలుగుంట పాఠశాల హెచ్ఎం ప్రసాద్, సీఆర్పీ సతీష్, ఉపాధ్యాయుడు రాంబాబు బహుమతులు ప్రదానం చేశారు.

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా స్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీలకు మాడుగుల, వీరనారాయణం పాఠశాలల విద్యార్థులు సిరివర్షిణి, యల్లపు యశ్వంత్ ఎంపికయ్యారని ఎంఈవో దేముడమ్మ చెప్పారు.



విజేతలతో రోలుగుంట ఎంఈఓ తదితరులు

పోటీతత్వం అలవర్చుకోవాలి

చోడవరం పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలని ఎంఈఓ సింహాచలం సూచించారు. స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో స్వర్ణాంధ్ర-2047లో భాగంగా అన్ని యాజమాన్యాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం మండల స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు జరిగాయి. 17 పాఠశాలల నుంచి 35 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఎం.రమేష్, ఎస్.బిందుమాధవి, కె.మౌనిక జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఉపాధ్యాయులు సన్నిబాబు, ఇస్మాయిల్, మణిమాల, రమేష్, సుష్మాదేవి, లక్ష్మి, కృష్ణ, గంగాధర్, కేవీఎం నాయుడు, శంకర్ పాల్గొన్నారు.

పాఠశాలలో క్షుద్రపూజల కలకలం!

కృష్ణదేవిపేట, న్యూస్‌టుడే: గొలుగొండ మండలం ఏఎల్‌పురం జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం రాత్రి క్షుద్ర పూజలు జరిగాయన్న వదంతి స్థానికంగా కలకలం రేపింది. శుక్రవారం ఉదయం పాఠశాలకు వెళ్లిన విద్యార్థులకు ఆవరణలో ముగ్గు, నిమ్మకాయలు కనిపించడంతో భయపడ్డారు. ఈ విషయం తెలిసి విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు పాఠశాలకు చేరుకున్నారు. ఉపాధ్యాయుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు వచ్చి పరిశీలించారు. విద్యార్థులను భయపెట్టేందుకు ఆకతాయిలు ముగ్గు వేసి నిమ్మకాయలు పెట్టి ఉంటారని, భయపడాల్సిందేమీ లేదని ఉపాధ్యాయులు, పోలీసులు చెప్పడంతో తల్లిదండ్రులు వెనుదిరిగారు.

కె.కోటపాడు, న్యూస్‌టుడే

సమస్య: కె.సంతపాలెంలో కోనేరులు ఆక్రమణలకు గురయ్యాయి. విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.
– అప్పారావు, కె.సంతపాలెం

✓: పరిశీలించి విచారణ చేపడతాం.
– ప్రసాద్, ఈవోఆర్డీ, కె.కోటపాడు

మేమున్నాం.. మీకు తోడుగా
నర్సీపట్నం - 80085 74743
చోడవరం - 80085 74732
మాడుగుల - 80085 74737

కాలువల్లో పూడిక తొలగింపు

స్పందనకు వందనం

చోడవరం గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణ శివారు అంబేడ్కర్ కాలనీ, రామ్మోహన్‌రావుపేట కాలనీల్లో పారిశుద్ధ్యం మెరుగుకు పంచాయతీ చర్యలు చేపట్టింది. 'కాలనీల్లో పారిశుద్ధ్యం అధ్వానం' శీర్షికన ఈ నెల 26న 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. పంచాయతీ కార్యదర్శి నారాయణరావు స్పందించి పారిశుద్ధ్య కార్మికులను పంపి కాలువల్లో పూడిక తీయించారు. రామాలయం పక్కన, రహదారిలో తుప్పలను తొలగించారు. సమస్య పరిష్కార కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కండక్టర్‌కు ప్రయాణికుల సత్కారం

దేవరాపల్లి, న్యూస్‌టుడే: ఈ నెలాఖరుతో ఉద్యోగ విరమణ చేయనున్న ఆర్టీసీ కండక్టర్ సీహెచ్ రాజేశ్వరరావును ఉద్యోగులు, ప్రయాణికులు శనివారం సత్కరించారు. విశాఖపట్నం నుంచి దేవరాపల్లి వచ్చే మద్దిలపాలెం డిపోకు చెందిన 12డి బస్సు కండక్టరుగా రాజేశ్వరరావు కొన్నేళ్లుగా అందరికీ సుపరిచితులు. ప్రయాణికులు సత్కారంతో ఆయన భావోద్వేగానికి గురయ్యారు.



రాజేశ్వరరావును సత్కరిస్తున్న ఉద్యోగులు, ప్రయాణికులు

సర్పా నదికి పోటెత్తిన వరద



పోచినపెద్ది అగ్రహారం వద్ద సర్పానది పరవళ్లు

మాకవరపాలెం, న్యూస్‌టుడే: బంగాళకాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తోడు, ఎగువ ప్రాంతాల నుంచి వరద పోటెత్తడంతో సర్పానది ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. తామరం ఉపాధ్యాయ కాలనీలో కాలువలు పొంగి రహదారిపై ప్రవహించడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. మాకవరపాలెంలో ఆర్టీసీ బస్టాండు ఆవరణలో వర్షపు నీరు నిలిచింది. బస్సులు ఎక్కేందుకు, దిగేందుకు ప్రయాణికులు అవస్థలు పడాల్సి వచ్చింది.

త్రుటిలో తప్పిన ప్రమాదం



కూలిన పై కప్పు

చోడవరం, న్యూస్‌టుడే: కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు స్థానిక ఎక్సైజ్ కార్యాలయం పైకప్పు పెంకులు ఊడి పడ్డాయి. ఆ సమయంలో ఇన్‌స్పెక్టర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు.

దేవీ నవరాత్రి ఉత్సవాలకు రాట

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: దేవీ నవరాత్రి ఉత్సవాలకు మాడుగుల దేవీ ఆలయం వద్ద శుక్రవారం ముహూర్తపు రాట వేశారు. సర్పంచి కళావతి, ఉప సర్పంచి శ్రీనాథు శ్రీనివాసరావు, ప్రసాద్ సూరిబాబు, వర్మ పాల్గొన్నారు. కేజేపురం కూడలిలోని సంతోషిమాత ఆలయం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి అమ్మవారికి పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు కొనసాగాయి. గోమాతకు మహిళలు పూజలు చేశారు.

బుచ్చెయ్యపేట: వడ్డాదిలో దేవీ నవరాత్రుల ఉత్సవాల నిర్వాహణకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. పొగాకు వర్తక సంఘం ఆధ్వర్యంలో బ్రాహ్మణ వీధిలో రాట వేశారు. అర్చకులు కృష్ణశర్మ, మహిళలు, వర్తక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నర్సీపట్నం, న్యూస్‌టుడే: శారదా నగర్‌లో వల్లీ దేవసేన సుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం గణపతి హోమం జరిగింది. షణ్ముఖ వేద గాయత్రి బ్రాహ్మణ అర్చక సంఘం ఆధ్వర్యంలో కలశ పూజ, లక్ష్మీగణపతి హోమం కొనసాగాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు భమిడిపాటి శర్మ తదితరులు పాల్గొన్నారు.



గోమాతకు పూజలు చేస్తున్న మహిళలు

వారం రోజులుగా నిలిచిన తాగునీటి సరఫరా

చోడవరం, న్యూస్‌టుడే: పట్టణంలో వారం రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దుడ్డు వీధి, కోనాం అతిథి గృహం వెనుక ఉన్న రెండు తాగునీటి పథకాల నుంచి నీటి సరఫరా కావడం లేదు. వీటికి గౌరీపట్నం దరి పెద్దేరు సమీపంలోని పంప్ హౌస్ నుంచి నీటిని ఎక్కిస్తారు. మూడు మోటార్లు మరమ్మతుకు గురవడంతో తాగునీటి పథకాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. జన్నవరం దరి పెద్దేరు వద్ద నిర్మించిన పంపింగ్ హౌస్‌లోనూ సాంకేతిక లోపం తలెత్తడంతో పంచాయతీ తాగునీటి సరఫరా విభాగం సిబ్బంది చేతులెత్తేశారు. చోడవరం పంచాయతీ, గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం అధికారుల మధ్య సమన్వయ లోపం వల్ల తరచూ ఇబ్బందులు తలెత్తుతున్నాయని పట్టణ ప్రజలు వాపోతున్నారు.

పెందుర్తి

ఉత్సాహంగా ఎంపిక పరీక్షలు

ఉక్కునగరం(స్టీల్‌సెక్టారు-3), న్యూస్‌టుడే : విశాఖ ఉక్కు సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) యూనిట్ ప్రాంగణంలో సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీసు ఫోర్స్, నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ, స్పెషల్ సెక్యూరిటీ ఫోర్స్, అస్సాం రైఫిల్స్ వంటి సంస్థల్లో కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి ఎంపిక పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈనెల 23న ప్రారంభమైన ఎంపిక ప్రక్రియ నవంబరు 9 వరకు కొనసాగనుందని సిబ్బంది తెలిపారు. యూనిట్ సీనియర్ కమాండెంట్ అత్తార్ మహ్మద్ హనీఫ్ పర్యవేక్షించారు.

ఉపముఖ్యమంత్రికి మద్దతుగా ఎమ్మెల్యే సంప్రోక్షణ దీక్ష

అప్పన్నపాలెం(వేపగుంట), న్యూస్‌టుడే: తిరుమల వేంకటేశ్వర స్వామి లడ్డూ నెయ్యి కల్తీపై ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేపడుతున్న సంప్రోక్షణ దీక్షకు మద్దతుగా అప్పన్నపాలెం పోలిపిల్లమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు శుక్రవారం దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దేశ చరిత్రలోనే అత్యంత దారుణాలు చేసే వ్యక్తిగా మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిలిచిపోతారన్నారు. ప్రజలను మోసం చేస్తే జనం ఎలాంటి బుద్ధి చెబుతారో ఇటీవల ఎన్నికల్లో చూశామన్నారు. అనంతరం ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటానికి ఎమ్మెల్యే పంచకర్లతో పాటు స్థానిక నాయకులు పాలాభిషేకం చేశారు. కూటమి నేతలు మజ్జి సూరిబాబు, బంటు సురేశ్, నోళ్ల అప్పలరాజు, ఉమామహేశ్, మజ్జి శ్రీను, ఈశ్వరరావు, పిన్నింటి పార్వతి, పిళ్లా జగన్‌మోహన్ పాత్రుడు, మామిడి దుర్గాప్రసాదు, లక్కీ గోవిందు తదితరులు పాల్గొన్నారు.



ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

రాంపురం(పెందుర్తి), న్యూస్‌టుడే: పెందుర్తి మండలం రాంపురంలో శుక్రవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి పైడిరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు గండి హిమబిందు, జెడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ రెడ్డి నారాయణరావు ముఖ్య అతిథులుగా పాల్గొని మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ మొక్కల పెంపకంతోనే సాధ్యమవుతుందన్నారు. అనంతరం వెల్ఫేర్ కళాశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెందుర్తి, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరు స్వచ్ఛతను పాటించడం ద్వారా అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చని జీవీఎంసీ 97వ వార్డు కార్పొరేటర్ శానాపతి వసంత అన్నారు. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేశ్ ఆధ్వర్యంలో పులగానిపాలెంలో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి మానవహారం నిర్వహించి అవగాహన ర్యాలీ చేశారు. సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న జెడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ రెడ్డి నారాయణరావు, ఎంపీటీసీ సభ్యురాలు హిమబిందు తదితరులు

నమ్మండి ఇది రహదారే..!

అధ్వానంగా లంకెలపాలెం - అసకపల్లి రోడ్డు



గండివానిపాలెం సమీపంలో భారీ గుంత



గాయత్రి కంపెనీ సమీపంలో..

లంకెలపాలెం(పరవాడ), న్యూస్‌టుడే

ఆ దారిలో కొత్తవాళ్లు ఎవరైనా ప్రయాణిస్తే ఇది రోడ్డేనా అనక తప్పరు. ఎందుకంటే వర్షం కురిస్తే చెరువులను తలపించే గుంతలు, ఎండెక్కితే మేఘాలను తలపించే ధూళి దర్శనమిస్తాయి. పరవాడ మండలం లంకెలపాలెం నుంచి అసకపల్లి వెళ్లే ప్రధాన ర.భ.శాఖ రహదారి ధ్వంసమై ప్రయాణికులకు చుక్కలు చూపిస్తోంది. దారి పొడుగునా పెద్దపెద్ద రాకాసి గుంతలు ఏర్పడటంతో పాటు రాళ్లుదేలడంతో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో ఈ రహదారిని పట్టించుకోకపోవడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందని పరిసర గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. కనీసం గుంతలను కూడా పూడ్చకపోవడంతో అవి ఇంతింతై వటుడింతై అన్నట్లు చెరువును తలపించేలా తయారయ్యాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్డు మరింత దారుణంగా తయారైంది. గుంతల్లో పెద్దఎత్తున నీరు చేరి వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. రెండు మండలాలను కలిపే ప్రధాన రహదారి కావడంతో పాటు పలు పరిశ్రమలు ఈ ప్రాంతాల్లో ఎక్కువగా ఉండటంతో రద్దీగా ఎక్కువగా ఉంటుంది. రోడ్డు అంచులు ధ్వంసమై ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పరిమితికి మించి అధికలోడుతో బూడిద, బొగ్గు తదితర భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్డు తొందరగా ధ్వంసమవుతోందని పరిసర గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. రాత్రి సమయంలో ఈ దారిలో ప్రయాణం మరింత ఆందోళనకరంగా మారిందని, ఒళ్లు హూనం కావడంతో పాటు తరచూ వాహనాలు మొరాయిస్తున్నాయని వాపోతున్నారు. రహదారి దుస్థితిని పలుమార్లు ర.భ.శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయిందని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా రహదారిని త్వరితగతిన బాగు చేయడానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పైడివాడ అగ్రహారంలో..



పైడివాడ అగ్రహారం - గండివానిపాలెం మధ్యలో..



అసకపల్లిలో..

రక్తదాన శిబిరానికి స్పందన

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం జాగృతి సంస్థ వ్యవస్థాపకులు కె.రామకృష్ణ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కె.సుజాత ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రెడ్‌క్రాస్ ఇండియా రక్తనిధి కేంద్రం సిబ్బంది హాజరై పలువురి పరీక్షలు చేసి అర్హులైన 50 మంది నుంచి రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా కె.సుజాత మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీఈవో కె.ఎల్.ఎన్.మౌక్తిక, రెడ్‌క్రాస్ ఇండియా సంస్థ సభ్యులు సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదాతలకు ధ్రువపత్రాలు అందిస్తున్న జాగృతి మేనేజింగ్ డైరెక్టర్ కె.సుజాత, నిర్వాహకులు

పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

వేపగుంట, న్యూస్‌టుడే: తమ పిల్లల ప్రవర్తన పట్ల తల్లిదండ్రులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని పెందుర్తి ఎస్ఐ అసిరితాత సూచించారు. జీవీఎంసీ 92వ వార్డు బంటాకాలనీలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువకులు ప్రస్తుత రోజుల్లో తప్పుదారి పడుతున్న తీరును వివరించారు. అపరిచిత వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామ కమిటీ అధ్యక్షులు అప్పలరాజు, కార్యదర్శి జి.ఆనంద్, అధ్యక్షుడు బి.చిన్నబాబు, మహిళలు పాల్గొన్నారు.



బంటాకాలనీ వాసులతో మాట్లాడుతున్న ఎస్ఐ అసిరితాత

స్వర్ణాంధ్ర-2047పై వ్యాస రచన పోటీలు

సబ్బవరం, న్యూస్‌టుడే: రాష్ట్రాన్ని 2047 నాటికి స్వర్ణాంధ్ర ప్రదేశ్‌గా అభివృద్ధి చేస్తామన్న నేపథ్యంలో విద్యార్థులకు స్వర్ణాంధ్ర-2047పై అవగాహన కల్పించేందుకు సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు శుక్రవారం వ్యాసరచన, వక్తృత్వం పోటీలు నిర్వహించారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ పీవీఎన్ మూర్తి, జి.భానుబంగారులక్ష్మి పర్యవేక్షించారు. వ్యాసరచనలో కొచ్చర్ల జయశ్రీ ప్రథమ, కోటపాడు దుర్గ ద్వితీయ, అనుపోజు హైమావతి తృతీయ, వక్తృత్వ పోటీల్లో పండూరి రూప ప్రథమ, మళ్ల కుందన ద్వితీయ, కర్రి సౌమ్య తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరిని ఈనెల 28న జరిగే జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ పీవీఎన్ మూర్తి తెలిపారు.

వైభవంగా స్నపన తిరుమంజన సేవ



శ్రీవారికి అభిషేకం చేస్తున్న అర్చకుడు

చినముషిడివాడ(పెందుర్తి), న్యూస్‌టుడే: వేంకటాద్రిపై కొలువుదీరిన కలియుగ దైవం వేంకటేశ్వర స్వామికి శుక్రవారం విశేష స్నపన తిరుమంజనం జరిగింది. ఆలయ ప్రధానార్చకుడు మహర్తి రామానుజాచార్యులు నేతృత్వంలో అర్చకులు తెల్లవారుజామున శ్రీవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలు, ఫలోదకాలతో అభిషేకం నిర్వహించారు. నూతన వస్త్రాలు అలంకరించి ధూపదీప సేవలతో కొలిచారు. అష్టోత్తర శతనామాలతో అర్చించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా దుర్గాదేవి పందిరి రాట ఉత్సవాలు

పరవాడ, న్యూస్‌టుడే: మేజర్ పంచాయతీ పరవాడ బొంకులదిబ్బ యూత్ ఆధ్వర్యంలో వచ్చేనెల 3 నుంచి 12 వరకు దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఈ మేరకు శుక్రవారం పందిరి రాట ఉత్సవాన్ని కనులపండువగా జరిపారు. భక్తులు పెద్దఎత్తున చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. వచ్చేనెల 3న అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, ఉత్సవాల్లో భాగంగా కుంకుమ పూజలు, హోమాలు, అన్నసమారాధన తదితర కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. 12న పలు సాంస్కృతిక ప్రదర్శనల నడుమ అనుపోత్సవం ఉంటుందన్నారు. సర్పంచి సిరిపురపు అప్పలనాయుడు, నేతలు పైలా శ్రీనివాసరావు, చుక్క రామునాయుడు పాల్గొన్నారు.



పరవాడలో రాట వేడుకలో పాల్గొన్న భక్తులు, నాయకులు, నిర్వాహకులు

పెందుర్తి, న్యూస్‌టుడే: జీవీఎంసీ 96వ వార్డు పెందుర్తి పాత పీహెచ్‌సీ ఎదురుగా దుర్గాదేవి యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పందిరి రాట వేడుక సంప్రదాయబద్ధంగా జరిపారు. మహిళలు రాటకు పసుపు కుంకుమ పూశారు. అర్చకులు పూజలు చేసి వేదిక ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పెందుర్తిలో రాట వేస్తున్న భక్తులు

బదిలీపై వెళ్లిన అధికారులకు సత్కారం

సబ్బవరం, న్యూస్‌టుడే: ఇటీవల నిర్వహించిన బదిలీల్లో సబ్బవరం మండలం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లిన అధికారులను స్థానిక సిబ్బంది శుక్రవారం సన్మానించారు. సబ్బవరం ఉప తహసీల్దార్ ఐ.వెంకటఅప్పారావు, మండల సర్వేయర్ కర్రి శ్రీనివాసరావు, టైపిస్టు విజయ్‌కుమార్‌తో పాటు మరో ఆరుగురు గ్రామ సర్వేయర్లు బదిలీపై ఇతర మండలాలకు వెళ్లారు. జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షుడు ఎస్టీ రామకాసు, సబ్బవరం ఆర్ఐవో వీరయ్య వీరిని ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా వారు అందించిన సేవలను వివరించారు. కార్యక్రమంలో వీఆర్‌వోలు రుక్మిణి, పూడి శేషు, సిబ్బంది పాల్గొన్నారు.



బదిలీపై వెళ్తున్న అధికారులను సత్కరించిన స్థానిక అధికారులు, సిబ్బంది



కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ సిబ్బంది, గర్భిణులు

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం

పరవాడ, న్యూస్‌టుడే: గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చునని సబ్బవరం ఐసీడీఎస్ సీడీపీవో లలితకుమారి అన్నారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా పరవాడ మండలం నాయుడుపాలెం అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం పోషకాహారంపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గర్భిణులు అంగన్వాడీ కేంద్రాల్లో ఇచ్చే ఆహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం పలువురు గర్భిణులకు సీమంతం చేశారు. కార్యక్రమంలో సర్పంచి కూండ్రపు వరలక్ష్మి, నాయకులు కె.మధు, సీతారామయ్య, శ్రీరామ్మూర్తి, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



వరద కాదు.. వృథా నీరు

ఈ చిత్రంలో రహదారిపై నిలిచిన నీటిని చూసి వర్షం నీరు అనుకుంటే పొరబడినట్టే. జీవీఎంసీ మంచినీటి పైపులైను పగిలి వృథా అవుతున్నా విలువైన తాగునీరు. జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ సమీపంలోని జీవీఎంసీ పైపులైను శుక్రవారం లీకేజీకి గురయ్యింది. పైపులు పగిలి పెద్దఎత్తున మంచినీరు వృథా అవుతోంది. ఇంద్రాణి కల్యాణ మండపానికి వెళ్లే దారిలోని కల్వర్టు వద్ద పైపులైను దెబ్బతింది. దీంతో ఉదయం నుంచి భారీఎత్తున మంచి నీరు రోడ్డు పాలయింది. బీఆర్టీఎస్ రహదారిలో నీరు నిలిచిపోవడంతో పాదచారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. తక్షణమే అధికారులు స్పందించి లీకేజీని అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, చినముషిడివాడ (పెందుర్తి)

దర్పణం

ఎట్టకేలకు గొయ్యి పూడ్చివేత

వేపగుంట, న్యూస్‌టుడే



జీవీఎంసీ 93వ వార్డు విరాట్‌నగర్ కూడలిలో మంచినీటి విభాగం సిబ్బంది అవసరం కోసం గొయ్యిని తవ్వి వదిలేయడంతో పలువురు ప్రమాదాలకు గురయ్యారు. ఈ విషయమై ఈనెల 20న 'గొయ్యి చూసి అడుగెయ్యి' శీర్షికతో 'ఈనాడు'లో ప్రచురించిన కథనానికి ఆ శాఖ అధికారులు స్పందించి గొయ్యిని పూడ్చాలని సిబ్బందిని ఆదేశించారు. మంచినీటి సరఫరాకు అవసరమైన సంపును నిర్మించి గుంతను పూడ్చారు.

ఈనాడు కథనానికి స్పందన

మ్యాన్‌హోల్ మూత ఏర్పాటు

పరవాడ, న్యూస్‌టుడే

పరవాడ మండలం గొర్లెవానిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ నుంచి పరవాడ బీసీ కాలనీకి వెళ్లే మార్గంలోని మ్యాన్‌హోల్ ఎట్టకేలకు మూత ఏర్పాటు చేశారు. గత కొంతకాలం నుంచి మ్యాన్‌హోల్‌పై ఇనుప డ్రమ్మును పెట్టి నెట్టుకొచ్చారు. రాత్రి సమయంలో చీకటి కారణంగా డ్రమ్ము కనబడక పలువురు ప్రమాదాల బారిన పడ్డారు. ఈ సమస్యపై 'ఈనాడు'లో పలుమార్లు కథనాలు ప్రచురించడంతో అధికారులు స్పందించి సిమెంట్ మూతను ఏర్పాటు చేశారు.



ప్రభుత్వ పింఛనుదారుల కార్యాలయం ప్రారంభం



పింఛనుదారులతో 97వ వార్డు కార్పొరేటర్ శానాపతి వసంత

చినముషిడివాడ(పెందుర్తి), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారుల సంఘం పెందుర్తి యూనిట్ కార్యాలయాన్ని జీవీఎంసీ 97వ వార్డు కార్పొరేటర్ శానాపతి వసంత శుక్రవారం ప్రారంభించారు. స్థానిక గ్రంథాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని ఆమె రిబ్బను కత్తిరించి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ సంఘానికి శాశ్వత భవనం నిర్మాణానికి సహకరించాలని కార్పొరేటర్‌ను కోరారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు అల్లం కృష్ణారావు, కార్యదర్శి వై.కామరాజు, ఉపాధ్యక్షుడు ఎ.ఈశ్వరరావు, సహ కార్యదర్శులు డి.భాస్కరరావు, జి.రామునాయుడు, కార్యవర్గ సభ్యులు రామానందం, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి మండలం తహసీల్దార్‌గా **ఎం.ఆనంద్‌కుమార్** శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రెండు నెలల క్రితం జరిగిన బదిలీల్లో భాగంగా కోరాడ వేణుగోపాల్‌ను పెందుర్తి తహసీల్దార్‌గా నియమించారు. ఇంతలోనే ఆయన్ను వీఎంఆర్‌డీఏ ప్రత్యేక తహసీల్దార్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో పద్మనాభం మండలం తహసీల్దార్ ఎం.ఆనంద్‌కుమార్‌ను పెందుర్తి తహసీల్దార్‌గా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయడం చర్చనీయాంశమైంది. ఆనంద్‌కుమార్ ఎన్నికలకు ముందు పెందుర్తి తహసీల్దార్‌గా పని చేసిన అనుభవం ఉంది. ఆయన బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో కార్యాలయం అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

సబ్ రిజిస్ట్రార్‌గా కీర్తిప్రియ



చినముషిడివాడ(పెందుర్తి), న్యూస్‌టుడే: పెందుర్తి జాయింట్ సబ్ రిజిస్ట్రార్‌గా నియమితులైన **ఎ.కీర్తిప్రియ** శుక్రవారం విధుల్లో చేరారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఆమె విజయనగరం జిల్లా చిట్స్ విభాగం నుంచి పెందుర్తికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాలను చేరుకునేలా లావాదేవీల నిర్వహణకు కృషి చేస్తామన్నారు. కార్యాలయం సీనియర్ సహాయకుడిగా సన్యాసిరావు విధుల్లో చేరారు.

సబ్బవరం ఏవోగా కె.ఎస్.పి.నారాయణరావు



సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండల పరిషత్ పరిపాలనా అధికారి (ఏవో)గా **కె.శివ ప్రసాద్ నారాయణరావు** శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా రాంబిల్లి నుంచి సబ్బవరం వచ్చారు. గతంలో చోడవరం, అనకాపల్లి, విశాఖ డివిజన్ కార్యాలయంలో విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన విధులను సక్రమంగా నిర్వహిస్తానన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఏవో ఎస్కే బాబూరావు, సీనియర్ అసిస్టెంట్ సుధాకర్, శ్రీదేవి తదితరుల పాల్గొన్నారు.

పెందుర్తి డీఈఈగా కోటేశ్వరరావు

పెందుర్తి, న్యూస్‌టుడే: విద్యుత్తు శాఖ పెందుర్తి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుగా **చొక్కాకుల కోటేశ్వరరావు** బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబును మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం ఎమ్మెల్యే నివాసంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. మండలంలో విద్యుత్తు సంబంధిత సమస్యలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆయనకు సూచించారు.



ఎమ్మెల్యేతో డీఈఈ